


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 09-08-2026 | సంపుటి - 31 | సంచిక - 76 | రూ : 4 | పేజీలు: 8


# ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు టీమార్స్

## టీజీసీఎస్‌బీ.. ఈగల్ తరహాలో త్వరలోనే సరికొత్త బ్యూరో

- 900 మంది పోలీసులతో రోడ్డు భద్రతకు ప్రాధాన్యం
- ట్రాఫిక్ చలానాల్లో 50% నిధులు కేటాయించే అవకాశం
- ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు



హైదరాబాద్: సైబర్ నేరాల నియంత్రణకు టీజీసీఎస్‌బీ.. మాదకద్రవ్యాల కట్టడికి ఈగల్.. ఇప్పుడు ఈ కోవలోనే తెలంగాణలో మరో సరికొత్త విభాగం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో(టీమార్స్) అందుబాటులోకి **తరువాయి 2లో**



## ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

- అటవీ, పర్యావరణ అనుమతులపై నిర్లక్ష్యం వద్దు
- మిడ్ మానేర్ ఎడమ కాలువ పనుల పునః ప్రారంభం : నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్

2లో

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు..

### తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

- అతిథులను కలవకుండా ఎస్ఐ అడ్డుకుంటున్నారని ఆరోపణ
- ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దంటూ అధికారిపై ఫైర్
- అతడిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు



కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల పట్ల సదరు అధికారి దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీట్ పేపర్ లీక్ వంటి విద్యార్థి సమస్యలపై పోరాటం ద్వారా 30 ఏళ్ల అభిజీత్ దీప్కే ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు రావడంతో వాలుజ్ ఎంఐడీసీ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. అయితే, మఫ్టీలో ఉన్న సురేశ్ అనే ఎస్ఐ తనను కలిసేందుకు వచ్చే వారిని లోపలికి రానీయకుండా ఆటంకం కలిగిస్తున్నారని దీప్కే ఆరోపించారు. వైరల్ అవుతున్న ఓ వీడియోలో అభిజీత్ దీప్కే సదరు ఎస్ఐని నిలదీస్తూ,"నేను రమ్మని పిలుస్తున్నప్పుడు ప్రజలను అను **తరువాయి 2లో**

## నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ!

# విద్యార్థులను నవ్వించిన ప్రధాని

**ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో బాబా బాగేశ్వర్ పేరును ప్రస్తావించిన ప్రధాని**

- డిగ్రీలతో పాటు దేశం కోసం ఏదైనా చేయాలనే కలను మోసుకెళ్తున్నారన్న మోదీ
- 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీల ప్రదానం, ప్రతిభావంతులకు పురస్కారాలు



- ప్రతిభావంతులైన విద్యార్థినుల సంఖ్య పెరగాలంటూ సరదాగా వ్యాఖ్య

2లో

## నీటి కష్టాలకు భారత్‌పై నెపం..

# పాకిస్థాన్ అసలు రంగు బయటపెట్టిన నివేదిక!



- అసలు కారణం అవినీతి, అంతర్గత కుమ్ములాటలేనని తెలిపిన నివేదిక
- పహల్గాం ఉగ్రదాడి తర్వాతే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్
- భారత్‌కు వ్యతిరేకంగా పాక్ సైన్యం ప్రచార కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపణలు
- పంజాబ్ వంటి ప్రావిన్సులు డ్యామ్‌లతో దిగువ రాష్ట్రాలను దెబ్బతీస్తున్న వైనం

2లో

## కుట్లు లేకుండానే గాయాలు మాయం..

# ఐఐసీటీ సరికొత్త ఆవిష్కరణ!




- శస్త్రచికిత్సల కోసం దేశీయ గ్లూను అభివృద్ధి చేసిన ఐఐసీటీ
- కుట్లకు ప్రత్యామ్నాయంగా గాయాలను త్వరగా మాన్పడానికి వినియోగం
- క్లినికల్ ట్రయల్స్‌లో సురక్షితమని తేలిన బయోకంపాటిబుల్ అడెసివ్
- తడి వాతావరణంలోనూ సమర్థవంతంగా పనిచేస్తుందని వెల్లడి
- వాణిజ్య ఉత్పత్తి కోసం ఫార్మా కంపెనీతో ఐఐసీటీ ఒప్పందం

## చైనాలో 'క్రమశిక్షణ' కేంద్రాలు..

# తల్లిదండ్రుల మాట వినకపోతే నిర్బంధమే!

- చైనాలో మాట వినని పెద్దలైన పిల్లల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు
- ప్రేమ వ్యవహారాలు, నిద్ర వేళల్లో తేడాల వంటి కారణాలతో బలవంతపు నిర్బంధం
- గతంలో ఇంటర్నెట్ బానిసల కోసం ఉన్న కేంద్రాలు ఇప్పుడు కొత్త రూపంలో వ్యాపారం
- ఒక యువతిని ప్రియుడి నుంచి విడదీసేందుకు బలవంతంగా కేంద్రానికి పంపిన తల్లిదండ్రులు



- ఇది చట్టవిరుద్ధమైనప్పటికీ తల్లిదండ్రులే చేర్పిస్తుండటంతో కొనసాగుతున్న దందా

## హైదరాబాద్ మియాపూర్‌లో

# పేలిన బెలూన్ సిలిండర్

**నలుగురికి గాయాలు**

- మియాపూర్ జీఎస్ఎం మాల్ వద్ద పేలిన బెలూన్ గ్యాస్ సిలిండర్
- ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు
- గాయపడిన వారిలో ఐస్ క్రీమ్ బండి యువకుడి పరిస్థితి విషమం



# ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నిధుల కొరత కారణంగా సాగునీటి పనులు ఆగొద్దని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బీర్. అంబేద్కర్ సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయనీ, మిగిలిన రూ.3 వేల కోట్లు ప్రాధాన్యతా క్రమంలో విడుదల చేస్తామని చెప్పారు. నిధుల కొరత కారణంగా చివరి దశలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్య అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రాజెక్టుల వారీగా ఎన్ని నిధులు అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలనీ, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. నాలుగున్నరేండ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన... ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు కాకతీయ ప్రధాన కాలువలో డి83 నుంచి డి94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయనీ, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు.

**రోళ్లవాగు 96 శాతం పూర్తి....**

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు. సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. బండ్ 2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయని చెప్పారు. సాంకేతికంగా ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వెంటనే ప్రాజెక్టును వాడుకలో తీసుకు రావాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. సమీక్షలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్‌ఇన్‌చీఫ్ ఓవి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రెటరీ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మియాపూర్‌లో పేలిన బెలూన్ సిలిండర్.. నలుగురికి గాయాలు

హైదరాబాద్‌లోని మియాపూర్ పరిధిలో శనివారం గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక జీఎస్ఎం మాల్ సమీపంలో బెలూన్లలో గ్యాస్ నింపేందుకు ఉపయోగించే సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది. మాల్ వద్ద బెలూన్లు విక్రయించే వ్యక్తి వద్ద ఉన్న సిలిండర్ పేలడంతో సమీపంలో ఉన్న నలుగురు గాయపడ్డారు. వీరిలో ఐస్ క్రీమ్ బండి నడుపుకునే ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అతడిని వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒక కళాశాల విద్యార్థిని, ఒక ఐటీ ఉద్యోగినితో పాటు మరో వ్యక్తి ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## చైనాలో 'క్రమశిక్షణ' కేంద్రాలు.. తల్లిదండ్రుల మాట వినకపోతే నిర్బంధమే!

చైనాలో ఒక వింత, ఆందోళనకరమైన ధోరణి వెలుగులోకి వచ్చింది. పిల్లలు పెద్దయ్యాక తమ మాట వినడం లేదనో, తమకు నచ్చని జీవితాన్ని ఎంచుకున్నారనో భావించే తల్లిదండ్రులు.. తమ సొంత పిల్లలనే బలవంతంగా క్రమశిక్షణ కేంద్రాలకు పంపుతున్నారు. ప్రేమలో పడటం, వీడియో గేమ్‌లు ఎక్కువగా ఆడటం, నచ్చిన ఉద్యోగం చేయడం, సరైన సమయానికి నిద్రపోకపోవడం వంటి కారణాలతో కూడా ఈ కేంద్రాల్లో నిర్బంధిస్తున్నారు. ప్రముఖ ఆన్‌లైన్ మ్యాగజైన్ 'ది డిప్లొమాట్' తన కథనంలో ఈ సంచలన విషయాలను వెల్లడించింది. గతంలో ఇంటర్నెట్ వ్యసనం (ఇంటర్నెట్ అడిక్షన్) మాన్పించే పేరుతో టీనేజర్ల కోసం మిలిటరీ తరహా క్రమశిక్షణ కేంద్రాలు చైనాలో వెలిశాయి. అయితే, ప్రజా వ్యతిరేకతతో అవి తమ పేర్లను 'ఫ్యామిలీ ఎడ్యుకేషన్ సెంటర్లు', 'ప్రవర్తనా కేంద్రాలు'గా మార్చుకున్నాయి. ఇప్పుడు ఇవే సంస్థలు పెద్దవాళ్లను కూడా లక్ష్యంగా చేసుకుని తమ వ్యాపారాన్ని విస్తరించాయి. ఈ ఏడాది మార్చిలో బీజింగ్‌లో జరిగిన ఒక సంఘటన ఈ దారుణాన్ని కళ్లకు కట్టింది. పియానో పాఠం చెప్పేందుకు ఒక అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన 21 ఏళ్ల సంగీత విద్యార్థినిని ఆమె తండ్రి, అత్త, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బలవంతంగా కారులో ఎక్కించారు. ఆమె ఫోన్‌ను లాక్కుని, వందల మైళ్ల దూరంలోని హెనాన్ ప్రావిన్స్‌లో ఉన్న ఒక క్రమశిక్షణ కేంద్రంలో 11 రోజుల పాటు నిర్బంధించారు. తన కూతురు ప్రేమ వ్యవహారం నచ్చని తల్లిదండ్రులు, ఆమెను తమ అదుపులో ఉంచుకునేందుకు ఈ పని చేసినట్లు 'సదరన్ పీపుల్ వీక్లీ' నివేదికను ఉటంకిస్తూ 'ది డిప్లొమాట్' పేర్కొంది. ఆరు నెలల నిర్బంధానికి సుమారు 26,800 యువాన్లు (రూ.3.8 లక్షలు), ఏడాదికి 36,800 యువాన్లు (రూ.5.17 లక్షలు) వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయని చైనా మీడియా కథనాలు చెబుతున్నాయి. నిద్రపోయే అలవాట్లను సరిచేయడానికి ఒక 21 ఏళ్ల యువకుడిని, ఒంటరిగా జీవిస్తున్న 25 ఏళ్ల యువతిని వారి కుటుంబ సభ్యులే ఇలాంటి కేంద్రాలకు తరలించారు. కొన్ని కేంద్రాల్లో 33 ఏళ్ల వయసున్న వారు కూడా టీనేజర్లతో కలిసి శిక్షణ పొందుతున్నట్లు తేలింది. చైనా చట్టాల ప్రకారం, ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించడం మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే నేరం. అయినప్పటికీ, ఈ నిర్బంధం వెనుక తల్లిదండ్రులే ఉండటంతో చట్టం భిన్నంగా స్పందిస్తోందని, ఇదే ఈ సంస్థలకు అలుసుగా మారిందని 'ది డిప్లొమాట్' నివేదిక విశ్లేషించింది. పెద్దయ్యాక తమ నియంత్రణలో లేని పిల్లలను బలవంతంగా దారిలోకి తెచ్చుకునేందుకు తల్లిదండ్రులు ఈ సంస్థలకు డబ్బు చెల్లించి, వారిని నిర్బంధింపజేస్తున్నారని నివేదిక స్పష్టం చేసింది.

## కుట్లు లేకుండానే గాయాలు మాయం..
## ఐఐసీటీ సరికొత్త ఆవిష్కరణ!

శస్త్రచికిత్సల సమయంలో గాయాలు త్వరగా మానేందుకు, కుట్ల అవసరాన్ని తగ్గించేలా హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) వినూత్నమైన స్వదేశీ సర్జికల్ గ్లూ (జిగురు)ను అభివృద్ధి చేసింది. ప్రమాదాల సంభవించినప్పుడు, శస్త్రచికిత్సల అనంతరం చర్మాన్ని వేగంగా అతికించడానికి ఈ బయోకంపాటిబుల్ టిష్యూ అడెసివ్ (జిగురు) ఎంతో దోహదపడనుంది. ఆల్కైల్ 2 సైనోయాక్రిలేట్ సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఈ జిగురు, తడిగా ఉన్న ప్రదేశాల్లోనూ గాయాలను తక్షణమే అంటిపెట్టుకుని, అవి వేగంగా నయం కావడానికి సహకరిస్తుంది. క్లినికల్ ట్రయల్స్‌లో ఇది శస్త్రచికిత్సలకు అత్యంత సురక్షితమైనదని రుజువైంది. దీని వినియోగానికి ఎలాంటి ముందస్తు సన్నాహాలు అవసరం లేకుండా నేరుగా వాడవచ్చు. ఈఎన్‌టీ, కాస్మెటిక్, డెంటల్ సర్జరీలతో పాటు సిజేరియన్, అపెండెక్టమీ, లాప్రోస్కోపీ వంటి కీలక శస్త్రచికిత్సలలో దీని వాడకం ద్వారా కుట్లపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ నూతన ఆవిష్కరణ రోగులకు సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా, శస్త్రచికిత్సల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని పరిశోధకులు తెలిపారు. ఈ సర్జికల్ గ్లూ వాణిజ్యపరమైన ఉత్పత్తి కోసం ఐఐసీటీ ఇప్పటికే ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనిని మరింత విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఇతర భాగస్వాములతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు సంస్థ పేర్కొంది. 1944లో హైదరాబాద్‌లో ఏర్పాటైన ఐఐసీటీ, దేశంలోని పురాతన, అత్యంత ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థలలో ఒకటిగా కొనసాగుతోంది.

## నీటి కష్టాలకు భారత్‌పై నెపం.. పాకిస్థాన్ అసలు రంగు బయటపెట్టిన నివేదిక!

తమ దేశంలో నెలకొన్న తీవ్ర నీటి సంక్షోభానికి కారణం భారత్ అంటూ పాకిస్థాన్ నిరంతరం ఆరోపణలు గుప్పిస్తున్నప్పటికీ, అసలు సమస్య వారి అంతర్గత పాలనా వైఫల్యాలు, అవినీతిలోనే ఉందని ఓ సంచలన నివేదిక వెల్లడించింది. కెనడాకు చెందిన 'జియోపొలిటికల్ మానిటర్' ప్రచురించిన కథనం ప్రకారం.. పాకిస్థాన్ చేతకానితనం, తప్పుడు ప్రణాళికలు, అవినీతి విధానాలే దేశాన్ని నీటి ఎద్దడి దిశగా నెట్టాయి. సింధు జలాల ఒప్పందం (ఐడబ్ల్యూటీ) విషయంలో భారత్‌పై యుద్ధానికి వెళతామంటూ బెదిరించడం ద్వారా పాకిస్థాన్ తనను తానే మరింత ప్రమాదంలోకి నెట్టుకుంటోందని ఆ నివేదిక హెచ్చరించింది. గతేడాది పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పహల్గాంలో జరిపిన కిరాతక దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన తర్వాత, సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు ఆపే వరకు ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అయితే, పహల్గాం దాడి విషయాన్ని దాచిపెట్టి, ఒప్పందం నిలిపివేతను భారత్ దుందుడుకు చర్యగా పాక్ చిత్రీకరిస్తోంది. సైనిక చర్యకు ఇదే సరైన కారణమంటూ రెచ్చగొడుతోంది. ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఛైర్మన్ బిలావల్ భుట్టో మాట్లాడుతూ.. భారత్ ఒప్పందాన్ని పునరుద్ధరించకపోతే అణ్వాయుధాలు ప్రయోగించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ వివాదంపై భారత్‌కు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టేందుకు పాకిస్థాన్ సైన్యానికి చెందిన ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) విభాగం ఒక ప్రచార వ్యూహాన్ని అమలు చేస్తోందని లీకైన పత్రాల ద్వారా తెలుస్తోందని నివేదిక పేర్కొంది. సైన్యం పౌర వ్యవహారాల్లో తలదూర్చుతోందన్న విమర్శలకు ఈ ఘటన మరింత బలం చేకూరుస్తోంది. నిజానికి 2015లోనే అప్పటి పాక్ జలవనరులు, విద్యుత్ శాఖల మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. జాతీయ దుబారా అలవాటు వల్లే దేశంలో నీరు, గ్యాస్, విద్యుత్ కొరత ఏర్పడిందని అంగీకరించారు. నీటి సమస్యలు పూర్తిగా దేశ అంతర్గత వ్యవహారమని ఆయన స్పష్టం చేయడం గమనార్హం. ఆయన వ్యాఖ్యలు, ప్రస్తుత పాక్ పాలకుల ఆరోపణలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఒప్పందం కుదిరిన నాటి నుంచి డ్యామ్‌ల నిర్మాణంపై పాక్ విపరీతమైన ఆసక్తి చూపింది. ఈ డ్యామ్‌ల నిర్మాణం సైన్యానికి పట్టున్న పంజాబ్ ప్రాంతానికే ఎక్కువగా ఉపయోగపడింది. ఈ క్రమంలో పంజాబ్ వంటి ఎగువ ప్రావిన్సులు దిగువన ఉన్న సింధ్ ప్రావిన్స్ వంటి ప్రాంతాల ప్రయోజనాలను దెబ్బతీస్తూ నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయని, అయినా కొత్త డ్యామ్‌ల నిర్మాణం ఆగడం లేదని ఆ నివేదిక వివరించింది.

## ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు టీమార్స్

హైదరాబాద్: సైబర్ నేరాల నియంత్రణకు టీజీసీఎస్‌బీ.. మాదకద్రవ్యాల కట్టడికి ఈగల్.. ఇప్పుడు ఈ కోవలోనే తెలంగాణలో మరో సరికొత్త విభాగం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో (టీమార్స్) అందుబాటులోకి రాబోతోంది. ట్రాఫిక్ ఇక్కట్ల పరిష్కారం కోసం పోలీస్ ఉన్నతాధికారుల మేధోమథనం నుంచి ఈ విభాగం రూపుదిద్దుకొంది. ఇప్పటివరకు రాష్ట్రంలో ట్రాఫిక్ విభాగాలు ఏ పోలీస్ యూనిట్‌కవే ప్రత్యేకంగా ఉన్నాయే తప్ప రాష్ట్రమంతటా ఏకరూపత లేదు. టీజీసీఎస్‌బీ, ఈగల్ మాదిరిగా రాష్ట్ర స్థాయి నుంచి పర్యవేక్షణా లేదు. రాజధాని ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం తన వాహనశ్రేణికి ట్రాఫిక్ విభాగం ఇచ్చే గ్రీన్‌ఛానల్ సదుపాయాన్ని వీలైనంత తక్కువ సమయానికి కుదించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా సుమారు 7 వేల మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రోడ్డు భద్రతతోపాటు ట్రాఫిక్ ఇక్కట్ల పరిష్కారం దిశగా పోలీస్ ఉన్నతాధికారులు కొత్త బ్యూరోను ప్రతిపాదించారు. ప్రభుత్వం వద్దకు చేరిన ప్రతిపాదనల దస్త్రానికి ఆమోదం లభిస్తే ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి దోహదమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

*** నిధుల సమీకరణకు కీలక ప్రతిపాదన**

ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు చలానాలను విధిస్తుండగా... మరోపక్క సిగ్నళ్లు సక్రమంగా పనిచేయకపోవడం.. జీబ్రా క్రాసింగ్‌లు, స్టాప్ లైన్లు తరచూ చెరిగిపోవడం.. గుంతల రోడ్లు తదితర ఇబ్బందులతో వారు విమర్శలు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి మున్సిపల్, ఆర్అండ్‌బీ శాఖల మధ్య సమన్వయ లోపం ఇందుకు ప్రధాన కారణం. కొత్త బ్యూరోను నెలకొల్పే క్రమంలో నిధుల సమీకరణకు ఉన్నతాధికారులు ప్రాధాన్యమిచ్చారు. ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.600 కోట్ల మేర ట్రాఫిక్ చలానాల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుండగా అందులో ఒక్క రూపాయి కూడా ట్రాఫిక్ పోలీస్ విభాగానికి రావడంలేదు. ఇకపై ఇందులో 50% మేర ట్రాఫిక్ విభాగానికి కేటాయించాలని ప్రతిపాదించారు.

*** అదనపు డీజీపీ లేదా ఐజీ నేతృత్వం**

కొత్త బ్యూరో అదనపు డీజీపీ లేదా ఐజీ నేతృత్వంలో ఏర్పాటు కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 900 మంది సిబ్బందికి ప్రత్యేకంగా ట్రాఫిక్ నిర్వహణ బాధ్యతల్ని అప్పగించనున్నారు. ఇటీవలే గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌ల నుంచి వెనక్కి రప్పించిన సిబ్బందిని కొత్త విభాగానికి కేటాయించనున్నారు.

## నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ..!
## విద్యార్థులను నవ్వించిన ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు. "మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ, మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్‌ల గురించి ఆలోచిస్తుండవచ్చు" అని మోదీ వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఈ రోజు మీ కుటుంబ సభ్యులు ఎంత గర్వపడుతున్నారో, నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నాను. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారు" అని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్పందిస్తూ.. "ప్రతిభావంతులైన విద్యార్థుల్లో కొంతమంది ఆడపిల్లలు ఉంటే బాగుండేది. క్షమించాలి, కొందరు కాదు, చాలామంది ఉండాలి" అని వ్యాఖ్యానించడంతో సభలో మరోసారి నవ్వులు విరిశాయి. అనంతరం ఐఐటీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రజ్ఞ' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హైపెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సదుపాయం ఏఐ, డేటా సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాల్లో ఐఐటీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుండిపోతారని మోదీ విద్యార్థులకు సూచించారు.

## భారత్‌పై 100శాతం టారిఫ్‌ల భారం.. బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం

భారత్‌అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ట్రంప్ మళ్లీ టారిఫ్‌లతో విరుచుకుపడేందుకు ముందడుగు పడింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు అమెరికా సెనెట్ తాజాగా ఆమోద ముద్ర వేసింది. ఇటీవల మృతిచెందిన సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా తీసుకొచ్చిన ఈ శాంక్షనింగ్ రష్యా , ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనెట్ 8611తో ఆమోదించింది. ఆగస్టు 31న ఈ బిల్లు ప్రతినిధుల సభ ముందుకు రానుంది. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత అమెరికా అధ్యక్షుడి సంతకంతో ఇది చట్టరూపం దాల్చనుంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే భారత్‌పై 100శాతం సుంకాలను విధించనున్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అగ్రరాజ్యం ఈ బిల్లును తీసుకొచ్చింది. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థిక సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. మాస్కో నుంచి చమురు దిగుమతులు చేసుకొనే దేశాలపై అధ్యక్షుడు అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం ఈ బిల్లుతో లభిస్తుంది.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయాలి

* **మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి దేవాదుల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తాగు, సాగునీటి అవసరాల కోసమే దేవాదుల ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. నిబంధనల ప్రకారం నెలకు ఆరు టీఎంసీల నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా.. తొమ్మిది పంపులు నడపాల్సిన చోట ఆరు, ఏడు పంపులతోనే సరిపెడుతున్నారని ఆరోపించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు



సాగునీరు అందడం లేదని విమర్శించారు.

* **గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని తరలించాలి**

రామప్ప నుంచి గ్రావిటీ ద్వారా గణపురం చెరువుకు నీటిని తరలించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.18 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నామని గండ్ర వెంకట రమణారెడ్డి తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పక్కన పెట్టిందని ఆరోపించారు. నీటిని తరలించే మార్గం అందుబాటులో ఉన్నప్పటికీ పంటలు ఎండిపోయే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. వెంటనే గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమై.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించడం సరికాదన్నారు. ఏరికోరి తెచ్చుకున్న ప్రభుత్వమే రైతుల పొట్ట కొడుతోందని విమర్శించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

* **అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి**

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని గండ్ర కోరారు. పెంచిన పింఛన్లను ఆగస్టు 15 నాటికి అర్హులైన లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో భూపాలపల్లి పట్టణ, గణపురం మండలాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రామ భక్తులకు అన్నం దానం

* **అన్నం పరబ్రహ్మ స్వరూపం**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీ గ్రామ నందు సాయిబాబా మందిరము లో ఖమ్మం జిల్లా పల్లెపాడు గ్రామానికి చెందిన సుమారు 40 మంది మహిళ రామభక్తులు భద్రాచలం కాలినడకన బయలుదేరి నడుస్తూ వస్తున్న భక్తులకు స్థానిక సాయిబాబా మందిరంలో వారికి చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి అన్నదానం నిర్వహించారు . ఈ సందర్భంగా వాసిరెడ్డి మురళి మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్ని దానాలలోకెల్లా అన్నదానం మిన్న అని ఆయన అంటూ స్వయంగా భక్తులకు అన్నం వడ్డించారు . అనంతరం భక్తులకు వాటర్ బాటిల్స్ , బిస్కెట్స్ అందజేశారు . రామ భక్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎన్ కె నగర్ ఉపసర్పంచ్ మహేష్ పాల్గొన్నారు .

## జయశంకర్ పార్క్ అభివృద్ధికి రూ.50 లక్షలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలోని జయశంకర్ పార్క్ అభివృద్ధికి సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించేందుకు ముందుకు వచ్చిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో పార్క్‌ను నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కేటాయించిన నిధులతో వాకింగ్ ట్రాక్, మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులు ప్రారంభించే ముందు ఇంజినీరింగ్ నిపుణులతో పాటు వాకర్స్, స్థానిక ప్రజలు, కార్మికులు, సంబంధిత వర్గాల అభిప్రాయాలను తీసుకుని అవసరమైన సౌకర్యాలను గుర్తించాలని సూచించారు. జయశంకర్ పార్క్‌ను ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరంగా, సురక్షితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. పార్క్ అభివృద్ధికి సహకరిస్తున్న సింగరేణి యాజమాన్యం, సీఎస్ఆర్ విభాగం, ఇంజినీరింగ్ అధికారులు, వాకర్స్, స్థానిక ప్రజలు, కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## యువత రాజకీయాల్లో ముందుండాలి

* **ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : రాష్ట్ర రాజకీయాల్లో యువత కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. రాజకీయాల్లో యువత ముందుండి నడవాలని, ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని మార్పు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన 'జెన్జీ యువత చర్చ విత్ తీన్మార్ మల్లన్న' కార్యక్రమంలో సుమారు 2 వేల మంది విద్యార్థులతో ఆయన భవిష్యత్ రాజకీయాలపై చర్చించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో హనుమకొండకు తరలివచ్చారు. పబ్లిక్ గార్డెన్ వద్ద విద్యార్థులు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తీన్మార్ మల్లన్న ఆశయాలు, ఆకాంక్షలకు ఆకర్షితులైన పలువురు విద్యార్థులు ఆయన సమక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. అనంతరం అంబేద్కర్ భవన్‌లో జరిగిన యువత చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, జనరల్ సెక్రటరీ పిట్టల వెంకటేష్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గండు కరుణాకర్, బొగ్గు గని కార్మిక విభాగం అధ్యక్షుడు అనంతుల సంపత్ బొట్టు, జిల్లా పార్టీ మీడియా ఇన్‌చార్జి మడే సంతోష్, బసవరాజుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి అశోక్ యాదవ్, వనం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు

* **బీజేపీ మండల అధ్యక్షుడు సొల్లె క్రాంతి కుమార్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మహిళల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు అని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అప్పీరియల్ పార్క్‌కు వెళ్లే మహిళా కార్మికులను తీసుకెళ్తున్న బస్సును నిలిపివేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా 55 మంది సామర్థ్యం ఉన్న బస్సులో 150 మందిని తరలించడం దారుణమని మండిపడ్డారు. ముస్తాబాద్, నామాపూర్, గూడెం, ఆవునూర్, తుర్కపల్లి గ్రామాల నుంచి మహిళలను ఒకే బస్సులో నింపి ప్రాణాపాయ స్థితికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అదనపు బస్సులు కేటాయించి మహిళలు సురక్షితంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పొన్నాల పద్మారెడ్డి, దాసరి విశ్వనాథ్, కుమ్మరి అంజయ్య, కనమేని శ్రీనివాస్ రెడ్డి, బోయిని రవి, పిట్ల రాజు, నక్కదాసరి దేవరాజు, నక్కల సుధాకర్ రెడ్డి, నక్కల మస్కట్ మల్లారెడ్డి, పిట్ల చంద్రయ్య, పిట్ల నరేష్, గంగాడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యం.. వారి సమస్యల పరిష్కారానికి కృషి

* **పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా జితేందర్ రెడ్డి.**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : రైతుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఉమ్మడి కొందుర్గు మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పీఏసీఎస్ నూతన చైర్మన్ తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి అన్నారు. కొందుర్గు మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. నూతన పాలకవర్గ సభ్యులను రైతులు, నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొదటగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రతి రైతుకు పీఏసీఎస్ పాలకవర్గం అందుబాటులో ఉండాలని, ఉమ్మడి మండలం కొందుర్గు, చౌదరిగూడ లపై ప్రత్యేక చొరవ చూపుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

* **నూతన పీఏసీఎస్ పాలకవర్గం ఇదే**

కొందుర్గు ఉమ్మడి మండలం పీఏసీఎస్ చైర్మన్ గా టి.జితేందర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా గోబ్రా నాయక్, డైరెక్టర్లు గా భీమారం మానయ్య, నంద కుమారి, కూర వీరన్న, గొల్ల మల్లేష్, మాదరి నర్సింలు, వాడ్ల నారాయణ చారి, తీగలపల్లి రాములు, ఎం.డి. ఇజాజ్ అలీ, కావలి వెంకటేష్, పటోళ్ల జగన్మోహన్ రెడ్డి, కాశ రత్నమ్మలు మొత్తం 13 మంది పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ గౌడ్, మాజీ సర్పంచ్ బాలరాజ్, గోపాల్, నర్సింలు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై 'చేపల వేట'..!

* **భూపాలపల్లిలో బీఆర్ఎస్ యువత వినూత్న నిరసన**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం వినూత్న నిరసన చేపట్టారు. టీఆర్ఎస్ అర్బన్ యూత్ ప్రధాన కార్యదర్శి మహేందర్ యాదవ్ నేతృత్వంలో యువకులు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో చేపల వలలు, గాలాలు వేసి చేపలు పడుతూ నిరసన తెలిపారు.రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో గుంతల్లో వర్షపు నీరు నిలిచి రహదారి చెరువును తలపిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షం కురిసిన ప్రతిసారీ రహదారి జలమయంగా మారడంతో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా యూత్ నాయకులు, మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ.. సుభాష్ కాలనీ ప్రధాన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి చేయకపోవడం అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో.. బీఆర్ఎస్ 16వ వార్డు కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, వార్డు అధ్యక్షుడు మోహనచారి, కంచు రాజేందర్, గట్టయ్య, రాయమల్లు, పృథ్వీ, తిరుపతి, నరసింహచారి, బ్రహ్మారెడ్డి, శోభన్‌బాబు, యూత్ నాయకులు జోర్ రాజ్‌కుమార్, అంగోతు తిరుపతి, గసిగంటి కుమార్, బానోతు మహేష్, ఆదిత్య, బన్నీ, మేకల రాజు, ఆకాష్, బీఆర్ఎస్వీ నాయకుడు కొలిజు దిలీప్‌కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

## అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి

* **కార్పొరేటర్ ముని గడప పద్మ డిమాండ్**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15న విడుదల చేస్తామంటున్న చేయూత సామాజిక పెన్షన్లను ఎలాంటి కొర్రీలు, ప్రాధాన్యత క్రమం కాకుండా అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని 16 వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం 16 వ డివిజన్ లో జరిగిన లబ్ధిదారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మీడియాలో ఆగస్టు 15న సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తారని వస్తున్న వార్తలు చూసి ప్రజలు సంతోషిస్తున్నారని, వారి సంతోషంపై నీళ్ళు చల్లద్దని, పెన్షన్ల మంజూరు చేస్తామని ఊరిస్తూ ప్రాధాన్యత క్రమం అంటూ అరకొర పెన్షన్లు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి డివిజన్లో సుమారుగా 100కు పైగా అన్ని రకాల పెన్షన్ దారులు అర్హులుగా ఉన్నారని, ప్రాముఖ్యత పేరుతో కేవలం డివిజన్‌కొక 15 నుండి 20 పెన్షన్లు ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఆమె కోరుతూ అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయకపోతే ప్రజలందరినీ సమీకరించి ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. . ఈ సమావేశంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు మునిగడప వెంకటేశ్వర్లు నాయకులు కాంపల్లి దుర్గయ్య, కాంపెల్లి పుష్ప, కాండ్రేగుల సత్యవతి,దొంగ నాగమణి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వివేకవర్ధిని డిగ్రీ పీజీ కళాశాలలో రక్తవర్గ నిర్ధారణ పరీక్షలు




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : లక్ష్మీదేవి పల్లి లో గల వివేకవర్ధిని డిగ్రీ పిజీ కళాశాల లో శనివారం నాడు ఎన్ఎస్ఎస్, , మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యం లో రక్తవర్గ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వీరబాబు ప్రారంభించారు.ఈ శిబిరం లో 300 మంది విద్యార్థిని, విద్యార్థులకు రక్తవర్గ నిర్ధారణ నిర్వహించారు . ఈ సందర్భంగా డాక్టర్ వీరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఆయన అంటూ, రక్త వర్గీకరణ తెలిసినట్లయితే ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే రక్తదానం చెయ్యటానికి వీలు అవటంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని, విద్యార్థులు రక్తదానం చెయ్యటానికి సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు . ఈ కార్యక్రమంలో జ్ఞానోదయ విద్యాసంస్థల చైర్మెన్ ఎం బి చౌదరి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రణవ్ కృష్ణ , కళాశాల ప్రిన్సిపల్ సతీష్, డీన్ సాయి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి . మల్లేష్, అకడమిక్ డైరెక్టర్ కిరణ్, ఏవో ప్రవీణ్, మైక్రో బయాలజీ అధ్యాపక బృందం , విద్యార్థులు పాల్గొన్నారు .

## ఆగస్టు 10న జరిగే జైల్ బరో ను జయప్రదం చేయాలి



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి లో జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జీపు జాతా నీ ప్రారంభించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఎస్.కె యాకూబ్ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక రైతు వ్యతిరేక విధానాలు మరింత వేగవంతంగా అమలు చేస్తుందని అన్నారు ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్నారని అన్నారు నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన కిట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు మతోన్మాదులకు వ్యతిరేకంగా నేడు కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు ప్రజాతంత్ర వాదులు పోరాడాలని కిట్ ఇండియా స్ఫూర్తితో భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10న జైలు బరో కార్యక్రమానికి సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణ అమలు చేస్తూ లేబర్ కోట్ల అమలుకు ఫైనల్ రూల్స్ ను నోట్పై చేసిందని అన్నారు విద్యుత్ సౌకర్య బిల్లు 2025 విత్తనచట్టన సవరణ బిల్లు ప్రతిపాదించారు సులభతర వ్యాపారం పేరుతో పెట్టుబడి దారుల లాభాల కోసం కేంద్రం ఊడిగం చేస్తుందని అన్నారు అందుకే ఆగస్టు పదిన జరిగే జైలు బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య దోసపాటి భిక్షం బీ శ్రీనివాస్ రాయిరాల శ్రీనివాస్ మీసాల మట్టయ్య ఏనాల సోమయ్య అంబటి బిక్షమయ్య ఎల్లావల నారాయణ వెంకటేశ్వర్లు ఒట్టికూటి అంజయ్య అంబటి వెంకటయ్య గుండెపురి సైదులు గుడి లక్ష్మయ్య బానోతు లక్ష్మి వాంకుడోత్ వెంకటమ్మ మాజీ ఎంపీటీసీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమ కృషి అభినందనీయం

* **సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యాభివృద్ధికి నోషి పరిశ్రమ చేస్తున్న కృషి అభినందనీయమని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నోషి పరిశ్రమ సహకారంతో చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ, విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి, రోడ్డు పాఠశాల అభివృద్ధికి నోసి పరిశ్రమ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగమైన నోషి పరిశ్రమ యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమ సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, గట్టు ప్రశాంత్, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్–44పై నిఘా మరింత పటిష్టం

* **టోల్‌గేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: జాతీయ రహదారి-44పై నిఘాను మరింత పటిష్టం చేయాలని మల్టీ జోన్-I ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులను ఆదేశించారు. శనివారం తూప్రాన్ టోల్‌గేట్ వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సీసీ కెమెరాల నిఘా, అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పనితీరును పరిశీలించారు. ఎన్‌హెచ్-44పై వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అతివేగం, రాంగ్ లేన్‌లో ప్రయాణించడం, వ్యతిరేక దిశలో వాహనాల రాకపోకలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలు, ట్రిపుల్ రైడింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి, సంబంధిత పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటీఎంఎస్ లోని ట్రాఫిక్ మానిటరింగ్ కెమెరాలు, వాహన వేగాన్ని గుర్తించే విఎఎస్డి, రాడార్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థలు, వేరియబుల్ మెసేజింగ్ సైన్ బోర్డులు తదితర వ్యవస్థలను ఐజీ పరిశీలించారు. ప్రమాదాలు, రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు, అడ్డంకులు, పాదచారుల రాకపోకలు వంటి ఘటనలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణ చర్యలు చేపట్టేలా వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.అతివేగంగా ప్రయాణించే వాహనాలను గుర్తించి ఈచలాన్ ద్వారా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు గుర్తించిన వెంటనే పోలీస్, అంబులెన్స్, సిబ్బందికి సమాచారం అందేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు.కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటలూ నిఘా కొనసాగించాలని, సీసీ కెమెరాలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, సాంకేతిక పరికరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నియంత్రణ, అత్యవసర సేవల వేగవంతమైన స్పందన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ తనిఖీలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎస్ఐ గంగా రాజు, టోల్ గేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జరిగే జైల్ భరోను జయప్రదం చేయాలి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరిగే జైల్ బరోను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 10న జరిగే జైల్ బరోను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జీపు యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా 16 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని అన్నారు. కార్మికులు దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లు తీసుకురావడం కార్మికుల హక్కులపై దాడి అని అన్నారు. వి బిజీ రాంజీ బిల్లును రద్దు చేయాలి లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని కోరుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జరిగే జైల్ బరో కార్యక్రమాలకు కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, ధనియాకుల శ్రీకాంత్, ఎల్గూరి గోవింద్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, వజ్జా శ్రీనివాస్, చెరుకు సత్యం, శివకృష్ణ, బత్తిని సైదులు, భూపాల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : చేయూత పింఛన్ల మంజూరు కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాలోని అర్హులందరూ తమ అర్హతకు అనుగుణంగా సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాలకు చెందిన వారు మున్సిపల్ వార్డు అధికారుల ద్వారా సంబంధిత మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు తమ దరఖాస్తులను ఎంపీడీవో/మున్సిపాలిటీ కార్యాలయాల్లో సమర్పించాలి. ఫైలేరియా పింఛనుదారులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో, డయాలసిస్, సికిల్ సెల్, హీమోఫిలియా వ్యాధులతో బాధపడుతున్న వారు రిమ్స్, ఆదిలాబాద్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఇప్పటికే దరఖాస్తు చేసి పింఛను మంజూరు పెండింగ్‌లో ఉన్నవారు కూడా తప్పనిసరిగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.దరఖాస్తుతో పాటు ఫోటోతో కూడిన దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, ఆదాయ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరిగా జతపరచాలని తెలిపారు. వితంతు పింఛనుకు మరణ ధృవీకరణ పత్రం, మరణించిన వారి ఆధార్ కార్డు, ఒంటరి మహిళ పింఛనుకు తహసీల్దార్ ధృవీకరణ పత్రం లేదా విడాకుల పత్రం, ఆధారితుల ఆధార్ కార్డు, దివ్యాంగుల పింఛనుకు సందరం / యుడిఐడి ధృవీకరణ పత్రం సమర్పించాలని పేర్కొన్నారు.అవసరమైన పత్రాలు లేకుండా సమర్పించిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవని కలెక్టర్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని త్వరితగతిన దరఖాస్తులు సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి పంట వేయవద్దు ఆరుతడి పంటలే వేసుకోవాలి

* **మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ఎల్ నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుండి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయకుండా ఆరు తడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందు కష్ట కాలంలో అధికారులు ప్రజా ప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజ్ లో ఉందని, శ్రీశైలం నుండి నీరు వచ్చినప్పటికి పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు .ఏ ఎం ఆర్ పి కూడా సగమే నిండిందని ,గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి లేదని, రాబోయే రోజుల్లో సూపర్ ఎల్ నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని, అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరు తడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడి లో భాగంగా 33 వేల ఎకరాలలో వరికి వదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని ,అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరు తడి పంటలు వేయించాలన్నారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్ఫార్మర్ల పై ఉన్న ఓవర్ లోడ్ ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామాగ్రిని తెప్పిస్తామన్నారు. కరువు వచ్చినప్పటికి నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని, పనులు కొనసాగుతున్నాయని, ఎఎం ఆర్పీ, ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లేముల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, కరువు వచ్చినా సరే శ్రీశైలం డెడ్ స్టోరేజ్ లో ఉన్నప్పటికీ ఎస్ఎల్బీసీ నుండి సాగునీరు అందించవచ్చన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్ట కాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులు రెండు పంటలు వరి వేస్తున్నారని,దీనివల్ల భవిష్యత్తులో భూములు సారం కోల్పోయి ఎందుకు పనికిరాకుండా పోతాయని, విపరీతంగా ఎరువులు వాడడం, నిరంతరం వరి సాగు చేయటం వల్ల భవిష్యత్ లో ఎలాంటి పంటలు వేసుకోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా కూరగాయల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఎం ఎల్ సి శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ,హాలియా ,నిడమనూరు పిఏ సి ఎస్ అధ్యక్షులు, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, తదితరులు హాజరయ్యారు కాగా ప్రాజెక్టులు, గ్రౌండ్ వాటర్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, విద్యుత్ అధికారులు డిఆర్డిఓ ప్రస్తుతం సాగునీటి పరిస్థితి, పంటలు, రాబోయే రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణ పై సమావేశానికి వివరించారు.

# నల్గొండలో లయన్స్ క్లబ్
## 17వ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవం




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320E 17వ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం నల్గొండలోని ఏచూరి గార్డెన్స్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె వి ప్రసాద్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ బాబూరావు ఘట్టమనేని, ఇన్స్టాలేషన్ ఆఫీసర్‌గా పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ నరేంద్ర భండారీ హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పి ఐ డి లయన్ డాక్టర్ బాబూరావు ఘట్టమనేని మాట్లాడుతూ..సమాజంలో పేదరికం, ఆరోగ్య సమస్యలు, విద్యా లోపాలను అధిగమించడానికి లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన క్యాబినెట్ సభ్యులు మానవత్వంతో కూడిన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, సమాజంలో ప్రతి ఒక్కరికీ లయన్స్ సేవలు అందుబాటులోకి రావాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథులుగా జి ఏ టీ ఏరియా లీడర్ లయన్ గోపాల్ రావు అరవింద, ల్ సి ఐ ఫ్ ఏరియా లీడర్ లయన్ దీపక్ భట్టాచార్య, కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ . అమర్‌నాథ్ రావు, ఇమ్మీడియట్ పాస్ట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ రాజేంద్ర ప్రసాద్,పి ఎం సి సి కోఆర్డినేటర్ లయన్ మోహన్ రావు తీగల, పాస్ట్ ఏరియా లీడర్ & డిస్ట్రిక్ట్ చీఫ్ అడ్వైజర్ లయన్ భీమయ్య జగిని పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లయన్ మదన్ మోహన్ రేపాల, ప్రభాకర్ రెడ్డి యారాల, . శివ ప్రసాద్, కోటేశ్వరరావు అమృతపల్లి, మోహన్ రెడ్డి యానాల, కృష్ణారావు దారా, రఘుపతి నేతి, . మురళీకృష్ణ కాపా, మురళీధర్ రావు మోతుకూరి, రమేష్, . బాలయ్య, ప్రసాద్, రాఘవ రెడ్డి ఆచవరం, గోపాల్ రెడ్డి పోరెడ్డి, లక్ష్మీనారాయణ వేములపల్లిలతో పాటు డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ చైర్‌పర్సన్ లయన్ . అమరేందర్ రెడ్డి గోలి, కో చైర్‌పర్సన్ లయన్ రమేష్ కర్నాటి పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా గవర్నర్ దంపతులను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమ వ్యాఖ్యాతలుగా లయన్ శైలజ ఏచూరి, లయన్ మురళీధర్ రెడ్డి తుమ్మలూరి, లయన్ సుధారాణి తోకల వ్యవహరించిన ఈ కార్యక్రమంలో టీమ్ సభ్యులు లయన్ శ్యామ్ బాబు ఉండ్రు, లయన్ శివ శంకర్ రావు సింహాద్రి, లయన్ రవీందర్ రావు బాచుపల్లి మరియు కొలాబరేటివ్ టీమ్ సభ్యులు లయన్ ప్రభాకర్ రావు లగడపాటి, లయన్ కమలాకర్ రావు రాచర్ల, లయన్ కరుణాకర్ రెడ్డి అలుగుబెల్లి, లయన్ సంతోష్ కొండ , వివిధ క్యాబినెట్ ఆఫీసర్లు, రీజియన్ చైర్మన్లు, జోన్ చైర్మన్లు, వివిధ క్లబ్ ల ప్రెసిడెంట్లు, సెక్రెటరీలు, ఆర్థిక కార్యదర్శులు మరియు ఇతర సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల పెన్షన్ల నిలిపివేత కాంగ్రెస్ వైఫల్యమే

* **భారతీయ జనతా పార్టీ నాయకులు కస్తూరి కార్తీక్ రెడ్డి విమర్శ**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పేదల పెన్షన్ల నిలిపివేత కాంగ్రెస్ వైఫల్యమేనని భారతీయ జనతా పార్టీ నాయకులు కస్తూరి కార్తీక్ రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులు, వృద్ధులు, పేదల సంక్షేమం విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు బీడీ కార్మికులు, వృద్ధులు, పేదలు తమ సమస్యలు చెప్పుకుంటున్నా స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం కష్టపడి కుటుంబాలను పోషిస్తున్న బీడీ కార్మికులకు, వయస్సు మీద పడి ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు పెన్షన్లు సకాలంలో అందించకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. పేదల ఓట్లతో అధికారంలోకి వచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. బీడీ కార్మికులు, వృద్ధులు తమ హక్కుగా పొందాల్సిన పెన్షన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి కల్పించడం తక్షణమే ఆపాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బీడీ కార్మికులు, వృద్ధుల పెన్షన్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. పేదల కన్నీళ్లతో నడిచే ప్రభుత్వం కాకుండా పేదల కోసం పనిచేసే ప్రభుత్వం కావాలని, భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని వెల్లడించారు.

# నాసిరకం పనులపై తాసిల్దార్ శ్రీదేవికి వినతి



ప్రజాస్ఫూర్తి, బైంసా : నిర్మల్ జిల్లా కుబీర్ మండల కేంద్రంలోని మేదరి కాలనీలో మురికి కాలువలు నిర్మాణ దశలోనే కుప్పకూలిన విషయం తెలిసిందే. దీంతో గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..మురికి కాలువల అభివృద్ధి పనులు మొదలుపెట్టిన నాటినుంచే నాసిరకంగా జరుగుతున్నాయనీ, ఈ విషయమై సంబంధిత కాంట్రాక్టర్ కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. మరోవైపు అధికారుల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు.కాంట్రక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షల రూపాయల ప్రజాధనం వృధా కావడమే కాక, పనుల పురోగతి నిలిచిపోయిందని, దీంతో మళ్లీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని అన్నారు. పనులు జరిగే చోట వార్డు సభ్యులు, గ్రామస్తులు ఒక్కసారిగా అధికారులను నిలదీశారు. అలాగే జరిగిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా.. ఈసారి ప్రత్యేక పర్యవేక్షణతో పాటు నాణ్యతతో పనులు చేపట్టాలని, తహశీల్దార్ శ్రీదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగాధర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అనిల్, బషీర్ వార్డ్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని
# ప్రాజెక్టుల నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తాం

* **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




ప్రజాస్ఫూర్తి , భైంసా: జిల్లాలోని ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాజెక్టుల నీటిమట్టం, సాగునీటి లభ్యత, పంటల సాగు, పంట మార్పిడి విధానాలు తదితర అంశాలపై నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు అవసరమైన మేరకు వర్షపాతం నమోదైనప్పటికీ, కొన్ని మండలాల్లో సుమారు 20 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 'ఎల్ నినో' ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు కార్యాచరణతో సాగునీటి నిర్వహణ చేపడుతున్నామని చెప్పారు.ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని భవిష్యత్తు అవసరాలు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వినియోగిస్తామని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) ద్వారా జిల్లాలో సుమారు 35 వేల ఎకరాలకు, కడెం ప్రాజెక్టు ద్వారా 6 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. అంతకుముందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశంలో ప్రాజెక్టుల నీటిమట్టం, సాగునీటి నిర్వహణ, భవిష్యత్తు అవసరాలు, ఆరుతడి పంటల ప్రోత్సాహం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై కలెక్టర్ చర్చించారు.ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రాజేంద్ర ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అవసరాలను బట్టి నీటి వినియోగం జరగాలి

* **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి, భైంసా : రైతుల పంటల అవసరాలను, ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా నీటి వినియోగం చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఆయన లక్ష్మణచందా మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఉన్న చెరువును పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెరువులోని నీటి మట్టం, గ్రామంలోని వ్యవసాయ సాగు నీటి అవసరాలను బేరీజు వేసుకొని నీటిని విడుదల చేయాలని సూచించారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందేలా, వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.అనంతరం చెరువు తూము పరిస్థితిని, కట్ట దృఢత్వాన్ని అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడే ఉన్న స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి, చెరువు కింద సాగవుతున్న పంటల రకాలు, మొత్తం ఆయకట్టు విస్తీర్ణం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఠాగూర్స్ హై స్కూల్లో వైభవంగా బోనాల వేడుకలు




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఆషాఢ మాస బోనాల వేడుకల సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ లో గల ఠాగూర్స్ హై స్కూల్ లో శనివారం ఆషాఢ మాస అమ్మవారి బోనాల ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలు పెట్టుకుని పాఠశాల నుంచి అమ్మవారి ఆలయానికి పోతురాజుల నృత్యాలతో డప్పు చప్పులతో వెళ్ళి అమ్మవారికి బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బండారు సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రాదాయాలను మర్చిపోకుండ ఉండేందుకు ప్రతి యేటా అమ్మవారి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండ మన సంస్కృతి సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యత ను తెలియజేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారులలో ఆధ్యాత్మికతతో పాటు సంప్రాదాయాల పట్ల గౌరవం పెంపోందుతుందన్నారు.ఈ సందర్భంగా పాఠశాల అవరణంలో విద్యార్థులు తమ ఆట పాటలతో సందడి చేసి ఆహుతులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎడ్యూకేషనల్ ట్రస్టు ఫౌండర్ ఇక్కుర్తి నారాయణ రావు, పాఠశాల డైరెక్టర్ బండారి నేహా, ఉమారాణి, నిర్మల, స్థానిక నాయకులు జల్దా లక్ష్మీనాథ్, రంగ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ మండల ఉపాధ్యక్షుడిగా సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : సమాచార హక్కు చట్టం( ఆర్టీఐ) సాధన కమిటీ చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షుడిగా దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాచార హక్కు చట్టం( ఆర్టీఐ) సాధన కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ శనివారం నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సమాచార హక్కు చట్టం కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, కమిటీ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. సమాచార హక్కు చట్ట సాధన కోసం కమిటీ లక్ష్యసాధన కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ 3వ వార్డు అధ్యక్షునిగా బండమీది వెంకటేష్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం, చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేన రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి చౌటుప్పల్ మున్సిపాలిటీ 3వ వార్డు (లింగోజిగూడెం) కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడిగా బండమీది వెంకటేష్ ను శనివారం నియమించారు. నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. 3వ వార్డు నూతన అధ్యక్షుడు బండమీది వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేన రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# పర్యావరణ పరిరక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత

* **సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా చేపట్టాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా చేపట్టాలని సూచించారు. మొక్కల పెంపకంతో అటవీ శాతం పెరుగుతుందని, తద్వారా పర్యావరణ సమతుల్యతతో పాటు సమయానికి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, గట్టు ప్రశాంత్, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వరి వేసి రైతులు నష్టపోవద్దు

* **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లాలో వాతావరణం అనుకూలించేలా లేనందున, ఈ ఏడాది వానలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో రైతులు వరి వేసి నష్టపోవద్దని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెల్ తో కలిసి ఎల్ నినో ప్రభావంపై అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం, నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ, ప్రాజెక్టులలో సమృద్ధిగా నీరు లేనందున నీటి విడుదల పై స్పష్టత లేదన్నారు. జిల్లాలోని 190 పెద్ద చెరువుల్లో చాలా వరకు 25 నుంచి 50 శాతం నీటితోనే ఉన్నాయని, భూగర్భ జలాలు కూడా రీఛార్జ్ కావడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఆగస్టు 8వ తేదీకి వచ్చేశామని, ఇప్పుడు వరి నాట్లు వేస్తే అవి కోతకు వచ్చేసరికి నవంబర్, డిసెంబర్ అవుతుందని కలెక్టర్ వివరించారు. అప్పటికి వర్షాలు ఉండవని, ప్రాజెక్టుల్లో నీళ్లు అయిపోతే పంట ఎండిపోయి రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో ఇంకా 2.35 లక్షల ఎకరాల్లో సాగు ప్రారంభం కావాల్సి ఉందని, ఆ రైతులంతా ఆలోచించుకోవాలని కోరారు.

* **కరువు వచ్చిన అండగా ఉంటాం – తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెల్**

రాష్ట్రంలో కరువు పరిస్థితులు కనిపిస్తున్నా ప్రజలెవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ భరోసా ఇచ్చారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కేందుకు సాగర్‌లో వరుణ యాగం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ ఈనెల 10వ తేదీన నాగార్జున సాగర్‌లో "వరుణ యాగం" నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. యాదగిరిగుట్ట అర్చకుల ఆధ్వర్యంలో జరిగే ఈ క్రతువులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు. ఈ పత్రికా విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, ఇరిగేషన్ సి ఇ నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ ని సవరించకపోతే సీఎం రేవంత్ రెడ్డి మాలల అగ్రహానికి గురికాక తప్పదు

* **పిల్లి సుధాకర్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోస్టర్ ను సవరించకపోతే మాలల ఆగ్రహానికి గురి కాక తప్పదని జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ హెచ్చరించారు. రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నల్లగొండ లోని గడియారం సెంటర్లో జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులు గోలి సైదులు అధ్యక్షతన చేపట్టిన మాలల మహాధర్నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యస్సీ వర్గీకరణ అనంతరం గ్రూప్ 3 లో ఉన్న మాల దాని అనుభంద 25 కులాలకు విద్యా, ఉద్యోగాలల్లో, ప్రమోషన్ లల్లో తీవ్ర అన్యాయం జరుగుతుంది అని వాపోయారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలల భవిష్యత్ ను నాశనం చేస్తున్నాడని తడిగుడ్డతో మాలల గొంతు కోస్తున్నాడని అన్నారు, యస్సీ రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది, ఇప్పటివరకు ప్రకటించిన 14 జాబ్ నోటిఫికేషన్ లలో యస్సీ గ్రూప్ 3 లోని మాల అనుబంద కులాల విద్యార్థులకు ఒక్క పోస్ట్ కూడా రావడం లేదని అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు మాలల వ్యతిరేక ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోస్టర్ ను సవరించకపోతే మాలల తమ ఆగ్రహానికి ప్రభుత్వాన్ని మార్చేస్తారని అన్నారు. ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ నాటి చంద్రబాబు శిష్యుడిగా రేవంత్ రెడ్డి వర్గీకరణ పేరుతో రాజ్యాంగ హక్కులకు భంగం కల్గిస్తున్నాడని అంబేద్కర్ ఆలోచనకు తూట్లు పొడిచే ఈ రాజ్యాంగ వ్యతిరేక విదానాలను ఎండగట్టడానికి ఉభయ రాష్ట్రాల మాలలు ఏకం కావాలని కోరారు.ఈ సమావేశం లో జిల్లా అధ్యక్షులు బోగరి విజయ్, నల్లవెల్లి సంజీవ, మాల జెఏసి కన్వీనర్ నల్లల కనఖరాజు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లు మేడి అంజయ్య, వెన్న రాజు, బుట్టి సత్యనారాయణ, సర్వే సార్, కళాకారుడు గోరేటి రమేష్, మాల యువత నాయకులు కట్ట వినయ్, చింతమల్ల విజయ్ కుమార్, ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లం రవి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించడం సరికాదు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : లక్షలాది మంది భవన నిర్మాణ కార్మిక కుటుంబాలకు ఖర్చు చేయాల్సిన 674 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళించడం సరికాదని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (టియుసిఐ అనుబంధం హెచ్74) ఆధ్వర్యంలో మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 65 ఐటిఐలను 10 ఆధునిక టెక్నాలజీ సెంటర్స్ (ఎసిటి)లు గా మార్చటానికి సెంటర్కు 10 కోట్ల చొప్పున కేటాయించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తిరిగి బోర్డు కు చెల్లించకుండా ఖర్చు చేయటానికి అవకాశం ఇవ్వటం భవన నిర్మాణ కార్మిక ద్రోహమేనని అన్నారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు ఇతర ఖర్చులను దృష్టిలో పెట్టుకొని పెళ్లి సహాయం కింద లక్ష రూపాయలు కాన్పు సహాయం కింద 50,000 సహజ మరణానికి ఐదు లక్షలు ప్రమాద మరణానికి 15 లక్షలు చెల్లించాలని కార్మిక వర్గం డిమాండ్ చేస్తుంటే పట్టించుకోకుండా ఉన్న నిధి నుండి డబ్బులు దారి మళ్లించడం సరికాదని అన్నారు.భవన నిర్మాణ కార్మిక కుటుంబాలలోని చదువుతున్న విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్షిప్లు మంజూరు చేయాలని చేస్తున్న డిమాండ్ సరికాదన్నారు. సహజ ప్రమాద మరణాలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన ఉప్పలయ్య మాట్లాడుతూ 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు 9000 పెన్షన్ ఇవ్వాలని,రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పై సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లికంటి వెంకన్న అధ్యక్షత వహించగా యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ధరావత్ సంతోష్, కోశాధికారి నెల్లుట్ల వెంకన్న, జిల్లా నాయకులు సిగ్గం వెంకన్న,మంగళపల్లి వెంకట కృష్ణ, యాకయ్య, వెంకన్న, సూరయ్య, రమేష్ వెంకన్న తదితరులు ప్రసంగించారు.

# సమగ్ర సూచిక బోర్డు ఏర్పాటు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చేసిన నిరంతర కృషికి ఫలితంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భవనంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల వివరాలను తెలియజేసే సమగ్ర సూచిక (డైరెక్టరీ) బోర్డు ఏర్పాటు చేయడం పట్ల టిజెఎసి హర్షం వ్యక్తం చేస్తోంది. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం భవనంలోని మూడు అంతస్తుల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తున్నప్పటికీ, వాటి గదుల సంఖ్యలు, అంతస్తుల వివరాలు, కార్యాలయాల పేర్లు తెలిపే సూచిక బోర్డు లేకపోవడంతో ప్రజలు,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన టి పి జె ఏ సి, 2025 మే 20 న జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించింది.ఆ వినతిపై స్పందన రాకపోవడంతో 2025 ఆగస్టు 7 న సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం ప్రజా సమాచార అధికారి ని ఆశ్రయించింది. నిర్దేశిత గడువులో సమాచారం అందకపోవడంతో మొదటి అప్పీలేట్ అధికారికి తేదీ 3.11.2025 న అప్పీల్ చేయనైనది. మొదటి అప్పీల్ కు కూడా సకాలంలో సమాచారం అందనందున, రాష్ట్ర సమాచార కమిషన్‌కు రెండో అప్పీల్ దాఖలు చేయబడింది.ఈ అప్పీల్ పై రాష్ట్ర సమాచార కమిషనర్ జారీ చేసిన నోటీసు మేరకు 07072026న జరిగిన విచారణకు టి పి జె ఏ సి ప్రతినిధులు హాజరై, ఐ డి ఓ సి వద్ద సూచిక బోర్డు లేకపోవడం వల్ల ప్రజలు అనవసరంగా ఒక కార్యాలయం నుంచి మరొక కార్యాలయానికి తిరుగుతూ సమయం, శ్రమ వృథా చేసుకుంటున్నారని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెంటనే సమగ్ర సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై జిల్లా పరిపాలన సానుకూలంగా స్పందించి, ప్రస్తుతం ఐ డి ఓ సి భవనంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల పేర్లు, గదుల సంఖ్యలు, అంతస్తుల వివరాలతో కూడిన సమగ్ర సూచిక బోర్డును ఏర్పాటు చేయడం అభినందనీయమైన చర్య.

# టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో అంబరాన్ని అంటినా బోనాల ఉత్సాహాలు



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం కాలనీ అపురూప కాలనీలో టీవిఆర్ మోడల్ హైస్కూల్, ఎస్ఆర్ నాయక్ నగర్ సత్యవాణి విద్యానికేతన్ స్కూల్స్ నందు ఆషాడ మాస బోనాల పండగ సంబరాలు అంబరాన్ని అంటాయి. టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ఆటపాటలతో సాంస్కృతిక నృత్యాలతో అందరినీ అల్లరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాది నుండి వస్తున్న సంప్రదాయాలను వివరిస్తూ ప్రకృతి దేవతలను వన దేవతలను కొలుస్తూ ఎటువంటి అంటు వ్యాదులు ప్రభ లకుండా ఉండాలని గ్రీష్మ రుతువు దక్షిణాయనం మొదలై వర్షాకాలం రావడంతో వాతావర ణ మార్పుతో కలరా, మసూచి, ప్లేగు , విష జ్వరాలు వంటి వ్యాధులు రాకుండా ఉండాలన్నారు. అమ్మవారి బెల్లన్నం భోజనంగా వండి మట్టి కుండలో పెట్టి పూజించి అమ్మవార్లకు నైవేద్యం ఇస్తారన్నారు. అలాంటి పద్ధతులను పాటిస్తూ ప్రతి వాడవాడన పసుపు కుంకుమలతో కాళ్లకు గజాలు కట్టి డప్పు చప్పులతో అమ్మవారి పూన కాలతో మనసు పులకించి మైమరిచి ఆటపాటలతో అమ్మవారిని కొలుస్తారన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో శివసత్తుల శిగాలు పోతరాజుల ఆటలు అన్నింటినీ కలబోసి చక్కటి సంస్థ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీవిఆర్ కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సుర రవిచంద్రా రెడ్డి, దీప్తి రెడ్డి, కరస్పాండెంట్ అరుణ కుమారి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

* **ట్రస్మా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు**




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ప్రైవేటు పాఠశాల వద్ద నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం ( ట్రస్మా ) మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. జగద్గిరిగుట్ట మగ్దుం నగర్ లోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద మధ్యతరగతి ప్రజానీకం అత్యధికంగా నివసించే జగద్గిరిగుట్ట లాంటి ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సీజన్ వ్యాధులు అత్యధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రస్తుత వాతావరణం లో ఈ శిబిరం మరింత దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల చెందిన వైద్య బృందం విద్యార్థులకు, స్థానికులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి నీలంశెట్టి,లయన్ జీత్, సుబ్రహ్మణ్యం రమేష్ బాబు, నర్సింహులు గౌడ్, భాషా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ సెంటర్ల ఏర్పాటుకు అభ్యర్థులకు వ్రాత పరీక్ష



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు, ఆత్మకూరు, మోత్కూరు, చౌటుప్పల్ మరియు నారాయణపూర్ మండలాల్లో 8 నూతన మీసేవ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులకు శనివారం భువనగిరి పట్టణంలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించారు. మీసేవ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో మొత్తం 209 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా, 166 మంది అభ్యర్థులు వ్రాత పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా ప్రక్రియను సంబంధిత అధికారులు పర్యవేక్షించారు.జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీ టి. నాగిరెడ్డి గారి పర్యవేక్షణలో వ్రాత పరీక్షను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షా ప్రక్రియ మొత్తం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించారు. ఈ పరీక్ష నిర్వహణ లో ఈడీఎం సాయి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సైదా పాల్గొన్నారు.

# డీప్‌ఫేక్ వీడియోలపై చర్యలు తీసుకోండి: మెటాకు కేంద్రం ఆదేశాలు




సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో డీప్‌ఫేక్ వీడియోలు.. బాలలపై లైంగిక వేధింపుల మెటీరియల్ (CSAM)పై 'మెటా' ప్రతినిధుల బృందంతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపింది. ఇందులో భాగంగా డీప్‌ఫేక్ వీడియోలపై చర్యలు తీసుకోవాని మెటా (Meta)ను కేంద్రం ఆదేశించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఉండే కంటెంట్‌కు ఆయా సంస్థలే బాధ్యత వహించాలని పేర్కొంది. భారత చట్టాలకనుగుణంగా మెటా మాధ్యమాలు ఎంత మేరకు నడుచుకుంటున్నాయన్నదానిపై అధికారులు ఆ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ రికమండేషన్ అల్గోరిథమ్‌ల గురించి ఆరా తీశారు. కంపెనీ ప్రతినిధులతో జరిపిన సమావేశాల ఫలితాలను సమీక్షించిన తర్వాత తదుపరి చర్యలపై కార్యాచరణను ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కూడా స్థానిక చట్టాలను పాటిస్తున్నాయా లేదా అనే విషయాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. చర్చల్లో భాగంగా.. తమ ప్లాట్‌ఫామ్‌లలోని డీప్‌ఫేక్‌ల (Deepfakes)పై కేంద్రం వ్యక్తం చేసిన ఆందోళనలపై మెటా స్పందించింది. అటువంటి కంటెంట్‌ను నిలిపివేసేందుకు తమ వద్ద పలు పరిష్కారాలు ఉన్నాయని తెలిపింది. ప్రధాని మోదీ విడుదల చేసిన ఓ వీడియో సందేశాన్ని ఫేస్‌బుక్ కొన్ని గంటల పాటు నిలిపివేసినందుకు సమన్లు జారీ చేయడంతో దాని మాతృసంస్థ 'మెటా' ప్రతినిధుల బృందం భారత్‌కు విచ్చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలోని ఇతర కంటెంట్‌పైనా కేంద్ర ప్రభుత్వం వారితో చర్చలు జరుపుతోంది. మెటా ప్రపంచ వ్యవహారాల హెడ్ జోయెల్ కప్లన్ నేతృత్వంలోని బృందంతో.. కేంద్ర ఐటీమంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా పలువురు అధికారులు చర్చిస్తున్నారు.

# ఈ రోజుల్లో 'సర్టిఫికెట్లకు' విలువ లేదు రాహుల్ గాంధీ



భారత్‌లో ఉన్న సుమారు 40 కోట్ల మంది యువతే దేశానికి అసలైన సంపద అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వారి సామర్థ్యం ప్రపంచంలోనే సాటిలేనిదన్నారు.
ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 'విద్యార్థుల గళం' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఈ రోజుల్లో దేశంలో స్టడీ సర్టిఫికెట్లకు విలువ లేదని, అవి ఉద్యోగాలు కల్పించడం లేవన్నారు. ఉద్యోగం పొందాలంటే కేవలం డిగ్రీ ఉంటే సరిపోదన్నారు. "అమెరికా, చైనా, రష్యాల గురించి ఎంతో మాట్లాడుకుంటున్నప్పటికీ.. మన దేశ యువతకు ఎవరూ సాటిలేరు. కానీ, ఈ రోజుల్లో మన దేశంలో స్టడీ సర్టిఫికెట్లకు విలువ లేదు. అవి మీకు ఉద్యోగాలు ఇప్పించలేవు. దేశంలో ఉపాధికి సంబంధించిన అన్నిదారులు మూసుకుపోయాయి. తయారీ రంగం పడిపోవడం, రుణాలు పొందడంలో ఇబ్బందులు, పరీక్ష పత్రాల లీకేజీ, ఉద్యోగాలను ఏఐ భర్తీ చేయడం వంటివి యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలపై రాహుల్ మాట్లాడుతూ.. యువత తమ భయాలను పక్కనపెట్టి.. చీకటిలో ఓ చిరు దీపం వెలిగించారని అన్నారు. తద్వారా దేశంలో మార్పునకు దోహదపడ్డారని చెప్పారు. అయితే, ద్వేషం, హింసకు తావులేదని.. ప్రేమ, ఆప్యాయతలతోనే వ్యవస్థలో మార్పు తీసుకురావాలని యువతకు పిలుపునిచ్చారు.

# మా ప్రభుత్వం వచ్చాక ఆ పాలసీ రద్దు చేస్తాం.. డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు జాగ్రత్త



హైదరాబాద్: నగరంలోని పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్(హిల్ట్) పాలసీపై సెప్టెంబర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్(KTR) అన్నారు. 10వేల ఎకరాలను ఎవరికో ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పాలసీపై పారిశ్రామిక అసోసియేషన్లకు లేఖలు రాస్తామన్న ఆయన.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని ప్రకటించారు. మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన కేటీఆర్.. ఈ పాలసీ కింద ఎవరైనా డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు జాగ్రత్త అని హెచ్చరించారు. భూ మాఫియాతో చేతులు కలపొద్దని పారిశ్రామికవేత్తలను కోరుతున్నట్లు పేర్కొన్నారు.

*** కేసీఆర్ చేసినన్ని యాగాలు ఎవరూ చేయలేదు..**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ (KCR) చేసినన్ని యాగాలు ఎవరూ చేయలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు చేస్తున్న వరుణ యాగాలు సహా పలు అంశాలపై స్పందిస్తూ.. "యాగాలు చేయొచ్చు కానీ.. ప్రభుత్వం కూడా తన బాధ్యతలు నిర్వర్తించాలి. దైవకృపకు మానవ ప్రయత్నం కూడా ఉంటేనే ఫలితం వస్తుంది. హరీశ్‌రావు గుడికి వెళ్తే.. కాంగ్రెస్ నేతలు చిల్లరగా మాట్లాడుతున్నారు. క్షుద్ర పూజలంటూ కాంగ్రెస్ క్షుద్ర, సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోంది. వ్యవసాయం, రైతుల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి పట్టింపు, అవగాహన లేవు. పాలమూరు బిడ్డగా చెప్పుకొనే ఆయన.. ఆ జిల్లాకు సాగునీరు ఇవ్వట్లేదు.

*** కేసీఆర్ నాయకత్వంలో భారీ పోరాటం**

అధికారంలో ఉన్నా.. లేకున్నా రాష్ట్రం బాగు కోరుకుంటాం. ఎక్కడికైనా వెళ్దాం.. 24 గంటల కరెంటు ఎక్కడ వస్తుందో చూపాలి. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీరు తీసుకుంటున్నా.. ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. తెలంగాణ నీటి హక్కుల్ని ఏపీ కొల్లగొడుతుంటే పట్టించుకోవట్లేదు. కేసీఆర్ నాయకత్వంలో పెద్దఎత్తున పోరాటం చేస్తాం. తెలంగాణ ఉద్యమం స్థాయిలో మళ్లీ ఉద్యమిస్తాం. గోదావరి బోర్డు సమావేశంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏంటో స్పష్టం చేయాలి. హైడ్రా పేరిట ఈ ప్రభుత్వం పేదల కడుపు కొడుతోంది" అని విమర్శించారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఆషాడ మాస అమ్మవారి బోనాలు

- **వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్**
- **వైష్ణవి టెక్నో స్కూల్ లో సందడి బోనాల ఉత్సవాలు**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతికగా ఆషాడ మాస అమ్మవారి బోనాలని వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ అన్నారు. ఆషాడ మాస అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్పూరి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో సందడి గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలు పెట్టుకుని పాఠశాల నుంచి అమ్మవారి ఆలయానికి పోతురాజులు బోనాల పాటలకు నృత్యాలతో డప్పు చప్పులతో వెళ్ళి అమ్మవారికి ఆలయంలో అమ్మవారికి బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండ మన సంస్కృతి సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియపరిచేందుకు ప్రతి యేటా పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాచీన విద్యకు.. పట్టం కట్టాలి

- **తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ మల్కంబ్ లో శిక్షణ తరగతులు**
- **చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భారతదేశ ప్రాచీన విద్య మల్కంబ్ కు రాబోయే రోజుల్లో పట్టం కట్టాలని చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్ అన్నారు. తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో మల్కంబ్ లో శిక్షకులకు లెవెల్ 1 రెండు రోజుల శిబిరాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ సిఐ మన్మథకుమార్ హాజరై ప్రారంభించారు. పోలీస్ ట్రైనింగ్ లోనే తమకు శిక్షణ ఉంది అనుకున్నాం కానీ, ఈ శిక్షకులను చూసిన తర్వాత మల్కంబ్ అసోసియేషన్ ఆకాంక్ష నెరవేరాలని ఆకాంక్షించారు. మీరు తయారు చేసిన విద్యార్థినీ, విద్యార్థులు ఒలంపిక్స్ లో పథకాలు గెలవాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా శిక్షకుల మల్కంబ్ ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో ఎంఎంఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సంజయ్ సాహు, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కే వి బి కృష్ణారావు, తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జని మంజుల, తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ముదావత్ గోపాల్, ట్రెజరర్ పోలే అంజయ్య, రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 42మంది శిక్షకులు తదితరు పాల్గొన్నారు.

# పరదాల బడికి పాక్షిక ఉపశమనం

- **శాశ్వత భవనం వెంటనే పూర్తి చేయాలి. టిపి జెఎసి**



మహబూబాబాద్ (కేసముద్రం) ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మండలం, బ్రహ్మంగారితండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దీనస్థితిపై తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చేసిన నిరంతర పోరాటానికి జిల్లా విద్యాశాఖ స్పందించింది. పరదాల మధ్య సాగుతున్న పాఠశాలను తాత్కాలికంగా ఒక ప్రైవేట్ ఇంటికి మార్చడం పట్ల టి జెఎసి హర్షం వ్యక్తం చేసింది.అయితే ఇది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, విద్యార్థులకు శాశ్వత భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా టిపి జెఎసి ప్రతినిధులు మాట్లాడుతూ బ్రహ్మంగారితండా పాఠశాల గత 25 ఏళ్లుగా సొంత భవనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు - మనబడి' కింద రూ.26 లక్షలు మంజూరు చేసి, 2022లో భవన నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ, గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయని గుర్తు చేశారు. ఈ గిరిజన ప్రాంత విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ టిపి జెఎసి ఆధ్వర్యంలో గత ఏడాది (2025) ఆగస్టులో పాఠశాల విద్యా సంచాలకులకు, అక్టోబర్‌లో ముఖ్యమంత్రి,జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ నిరంతర ప్రాతినిధ్యాల ఫలితంగానే విద్యాశాఖ తాత్కాలికంగా పాఠశాలను ప్రైవేట్ భవనంలోకి మార్చిందని పేర్కొన్నారు. తాత్కాలిక మార్పు అభినందనీయం అయినప్పటికీ, సొంత భవనం లేకపోతే సమస్య పూర్తిగా పరిష్కారం కాదని టిపిజెఎసి స్పష్టం చేసింది. కావున, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణానికి అత్యవసరంగా నిధులు విడుదల చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరనైనది.మైస శ్రీనివాసులు (స్టేట్ కో కన్వీనర్, మామిడాల సత్యనారాయణ. కన్వీనర్. మహబూబాబాద్.కే జానీ,లింగ్యా టిపి జెఏసి మహబూబాబాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.

# వ్యవసాయ అధికారిని బెదిరించి రూ.1.30 లక్షలు వసూలు

- **రూ.20 లక్షలు డిమాండ్ చేసిన ఇద్దరు సోషల్ మీడియా జర్నలిస్టుల అరెస్ట్**
- **డీఎస్పీ బి.అశోక్**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: జిల్లా వ్యవసాయ అధికారిని బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన ఆరోపణలపై ఇద్దరు సోషల్ మీడియా జర్నలిస్టులను ఆసిఫాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆసిఫాబాద్‌కు చెందిన దేవేందర్ (30), గంగాపూర్‌కు చెందిన సురేష్ (30)లను హైదరాబాద్‌లో శుక్రవారం అదుపులోకి తీసుకుని ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కోర్టులో రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ బి.అశోక్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. జిల్లా వ్యవసాయ అధికారి బోర్కుట్ వెంకటి ఆగస్టు 5న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాలు, ఫిర్యాదుదారుడు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నిందితులు ఇద్దరూ పరస్పరం కుమ్మక్కై వ్యవసాయ అధికారిని బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. రాధిక ట్రేడర్స్ యజమానితో ఏ1కు ఉన్న వ్యక్తిగత విభేదాల నేపథ్యంలో దుకాణాన్ని మూసివేయించేందుకు వ్యవసాయ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. అయితే దుకాణానికి సంబంధించిన లైసెన్సులు, రికార్డులు సక్రమంగా ఉన్నట్లు అధికారుల విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితులు ఫోన్ కాల్స్, వీడియోలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా వ్యవసాయ అధికారిపై ఒత్తిడి తెచ్చి డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. మొదట రూ.20 లక్షలు డిమాండ్ చేసి, బెదిరింపుల ద్వారా ఈ ఏడాది జూలై 26న రూ.1.30 లక్షలను నగదుగా తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారానికి సంబంధించి వాట్సాప్ చాట్స్, సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, స్క్రీన్‌షాట్లు తదితర డిజిటల్ ఆధారాలను సేకరించినట్లు తెలిపారు.

**గతంలోనూ కేసు..**

ఏ2 సురేష్‌పై గతంలో కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైనట్లు పోలీసు రికార్డుల పరిశీలనలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. మైనర్ బాలికకు సంబంధించిన వివరాలు, వీడియోలను సోషల్ మీడియాలో బహిర్గతం చేసిన వ్యవహారంలో ఆ కేసు నమోదై విచారణలో ఉన్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులుగా తమ వృత్తిని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ తెలిపారు. డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీలు, ఫోన్ కాల్స్, ఇతర సాక్ష్యాలను పూర్తిస్థాయిలో సేకరించి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, నేరం రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కేసు దర్యాప్తులో ఆసిఫాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జైల్ భరో పోస్టర్ల విడుదల




ప్రజాస్ఫూర్తి, భైంసా : ఆగస్టు 10 న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికుల రైతుల వ్యవసాయ కూలీలు సమస్యల పరిష్కారం కోసం నిర్మల్ లో జరిగే జైలు భరో కార్యక్రమ పోస్టర్స్ ను సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భైంసా మార్కెట్ యార్డ్ లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ ,జిల్లా అధ్యక్షులు *డాకూర్ తిరుపతి ఏఐయుకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేందర్,ఏ ఐ కే ఎం ఎస్ రాష్ట్ర కార్యదర్శి జే రాజు, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, , రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఇప్ప లక్ష్మన్, చింతకుంట శంకర్, నాగుల నర్సాగౌడ్, బుల్లోళ్ల ప్రసాద్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న, నాయకులు గోదావరి,బిరోళ్ల నవీన్, షాదుల్ల సంజు,లు పాల్గొన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు దుర్గం నూతన్ కుమార్ జే రాజు తదితరులు పాల్గొన్నారు.

# ద్రోహులను కలుస్తారు గానీ.. విద్యార్థులను కలవరా? మోదీపై ఉద్ధవ్ విమర్శలు



తమ పార్టీని వీడి శిందే నేతృత్వంలోని శివసేనలో చేరిన తిరుగుబాటు ఎంపీలతో శుక్రవారం ప్రధాని మోదీ సమావేశం కావడంపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న యువతను కలవడానికి సమయం లేని ప్రధాని.. ద్రోహులను కలవడానికి మాత్రం సమయం కేటాయించారని దుయ్యబట్టారు. శిందే వర్గానికి చెందిన పార్టీనే అసలైన శివసేన గా గుర్తిస్తూ.. ఎన్నికల కమిషన్ చేసిన ప్రకటనపై ప్రస్తుతం సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో తమను భయపెట్టాలనే ఉద్దేశంతోనే అండగా ఉంటామని మోదీ వారికి హామీ ఇస్తున్నారని ఉద్ధవ్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగబద్ధంగా ఉంటుందన్నదే తన ఏకైక ఆశ అని.. ఆ విషయంలో తనకు పూర్తి నమ్మకం ఉందని ఠాక్రే పేర్కొన్నారు. మరోవైపు ప్రత్యర్థి శివసేనలో ఆరుగురు ఎంపీల విలీనాన్ని గుర్తిస్తూ లోక్‌సభ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని శివసేన (యూబీటీ) సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసింది.

*** ఇది తుపానుకు ముందు ప్రశాంతత..**

దిల్లీలో ఇటీవల జరిగిన జెన్‌జీ నిరసనలు కేంద్ర ప్రభుత్వాన్ని కుదిపేశాయని ఠాక్రే అన్నారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితులు తుపానుకు ముందు ప్రశాంతతే అని పేర్కొన్నారు. ఇకపై ప్రభుత్వం ఏ తప్పు చేసినా.. వారు ప్రశ్నిస్తూనే ఉంటారన్నారు. మొత్తం ప్రభుత్వాన్నే మార్చాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. యువతకు మద్దతుగా ఉండాల్సిన ప్రభుత్వం పోలీసులతో వారిని కొట్టించిందని విమర్శించారు. కొవిడ్ సమయంలో ఫేస్‌బుక్ లైవ్ సెషన్‌లు నిర్వహించినందుకు తనను విమర్శించిన వారే.. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఎద్దేవా చేశారు.

# హసన్‌పర్తి సమీపంలో తెగిపడిన విద్యుత్ వైర్లు.. రైళ్ల రాకపోకలకు అంతరాయం



హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై విద్యుత్ వైర్లు తెగిపడటంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు గూడ్స్ రైళ్లను అధికారులు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. తెగిపడిన విద్యుత్ వైర్లను సరిచేసిన అనంతరం రైళ్ల రాకపోకలను అధికారులు తిరిగి ప్రారంభించారు. దాదాపు గంట పాటు నిలిచిపోయిన బలార్షా ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు గూడ్స్ రైళ్లు తమ గమ్యస్థానాల వైపు బయలుదేరాయి. రాకపోకలు పునరుద్ధరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.




# యూపీఐ లావాదేవీలు.. అవన్నీ ఉచితమే - కేంద్రం క్లారిటీ

యూపీఐ లావాదేవీల ఛార్జీలపై కేంద్ర ఆర్థికశాఖ కీలక ప్రకటన చేసింది. వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు (No Charges for UPI Users) ఉండవని వెల్లడించింది. వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలన్నీ యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. వ్యాపారులకు సంబంధించి అత్యధిక శాతం యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని.. భవిష్యత్తులో ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) అమల్లోకి వచ్చినా అందరిపై ఏకపక్షంగా ఉండదని పేర్కొంది. మర్చంట్ లావాదేవీలపైనే నామమాత్రపు ఎండీఆర్ ఉంటుందని తెలిపింది. డెబిట్, క్రెడిట్ కార్డుల ఎండీఆర్ కంటే ఈ ఛార్జ్ తక్కువ ఉంటుందని తెలిపింది. ఎంపిక చేసిన డిజిటల్ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్




రేట్ (ఎండీఆర్) ఛార్జీ విధించేందుకు బ్యాంకులు, చెల్లింపుల సేవా సంస్థలకు అధికారం కల్పించే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. డిజిటల్ చెల్లింపులపై ఎండీఆర్ రుసుముల విధింపును అడ్డుకునే పాత నిబంధనలను తొలగించారు. దీంతో యూపీఐ లావాదేవీలన్నింటిపై ఛార్జీలు పడతాయనే పౌరులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్రం స్పష్టతనిచ్చింది.

# యూపీఐపై ఛార్జీలు ఉండవు: ఫోన్‌పే

యూపీఐ లావాదేవీలపై ఛార్జీల వసూలుకు సంబంధించిన బిల్లు లోక్‌సభలో ఆమోదంతో పొందడంతో.. డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సాధారణ వినియోగదారుల్లో ఛార్జీల ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఫోన్‌పే వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ నిగమ్ కీలక ప్రకటన చేశారు. యూపీఐ లావాదేవీలపై భారతీయ వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. భారతీయ యూజర్లకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే ఉంటాయని, డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని నిగమ్ స్పష్టం చేశారు. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం 2007 సవరణ బిల్లును లోక్‌సభలో ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే ఈ సవరణల వల్ల ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యులు




లేదా స్నేహితుల బ్యాంకు ఖాతాలకు యూపీఐ ద్వారా పంపే వ్యక్తిగత నగదు లావాదేవీలకూ ఛార్జీలు వర్తించవు. రూ.1.5 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగి ఉండే షాపింగ్ మాల్స్, కార్పొరేట్ సూపర్ మార్కెట్లు, లగ్జరీ హోటళ్ల వంటి వాటిల్లో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన చెల్లింపులపైనే ఎండీఆర్ ఛార్జీలు విధించే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే భవిష్యత్తులో ఇతర లావాదేవీలకూ ఈ ఛార్జీలు వర్తింపజేస్తారన్న భయాలు ప్రజల్లో నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఫోన్‌పే సీఈవో ప్రకటన కీలకంగా మారింది.

# జియో కొత్త ప్లాన్లు.. 15 ప్రీమియం ఓటీటీ యాప్‌లు ఫ్రీ

ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో తన ఓటీటీ పాస్ పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. ఇప్పటికే 28 రోజుల వ్యాలిడిటీతో రూ.200 పాస్‌ను అందిస్తుండగా.. కొత్తగా 3 నెలలు, ఏడాది వ్యాలిడిటితో కొత్త పాస్‌లను ప్రవేశపెట్టింది. రూ.550, రూ.2 వేలతో జియో ఓటీటీ పాస్‌లను తీసుకొచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్ కోరుకునే వినియోగదారులే లక్ష్యంగా, దీర్ఘకాల సబ్‌స్క్రిప్షన్ కోసం ఈ పాస్‌లను లాంచ్ చేసింది. ఆగస్టు 7 నుంచే ప్లాన్లు అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.




- రూ.550 ఓటీటీ పాస్ వివరాలు.. 84 రోజుల వ్యాలిడిటీ, 90 జీబీ హైస్పీడ్ డేటాతో ప్లాన్ వస్తుంది. అపరిమిత 5జీ ఉంటుంది. వాయిస్ కాల్స్ ఉండవు. మూడు నెలలు, ఏడాది బేస్ ప్లాన్‌తో జియో సబ్‌స్క్రైబర్లకు అందుబాటులో ఉంది.
- రూ.2వేల ఓటీటీ పాస్.. 365 రోజుల వ్యాలిడిటీ, 365 జీబీ హైస్పీడ్‌డేటాతో ప్లాన్ తీసుకొచ్చారు. అపరిమిత 5జీ ఉంది. ఏడాది బేస్ ప్లాన్ మాత్రమే అందుబాటులో ఉంది. వాయిస్‌కాల్స్ ఉండవు.
- 15 ప్రీమియం ఓటీటీ యాప్‌లు, జియో టీవీలో వెయ్యికి పైగా ఛానెళ్లు వీక్షించొచ్చు. ఈ ప్లాన్‌ల ద్వారా రూ.1500 విలువైన నెలవారీ ప్రయోజనాలను పొందొచ్చని జియో వెల్లడించింది. ఈ ప్యాక్ ద్వారా వినియోగదారులు టీవీ, టాబ్లెట్, మొబైల్ పరికరాల్లో ప్రకటనలు లేకుండా, బ్యాక్‌గ్రౌండ్‌ప్లే చేస్తూ యూట్యూబ్ ప్రీమియంను యాక్సెస్ చేయొచ్చు.
- దీంతో పాటు లైవ్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ ఒరిజినల్స్, బ్లాక్‌బస్టర్ హాలీవుడ్ కంటెంట్‌తో జియోహాట్‌స్టార్ మొబైల్+ హాలీవుడ్ యాక్సెస్‌ను అందిస్తున్నారు. కొత్త పాస్‌ల ద్వారా అమెజాన్ ప్రైమ్ లైట్ మెంబర్‌షిప్‌తో ప్రైమ్ వీడియో స్ట్రీమింగ్ యాక్సెస్ చేయొచ్చు. గతంలో తీసుకొచ్చిన రూ.200 పాస్‌తో అమెజాన్ ప్రైమ్ వీడియో మొబైల్ ఎడిషన్ అందుబాటులో ఉంది.
- జియో టీవీ ద్వారా సోనీలివ్, జీ5, లయన్స్‌గేట్ ప్లే, డిస్కవరీ ప్లస్, సన్‌నెక్స్, ఫ్యాన్‌కోడ్ వంటి మరో 12 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను యాక్సెస్ చేయొచ్చు. స్టార్ ప్లస్ హెచ్‌డీ, కలర్స్ హెచ్‌డీ, సన్ టీవీ హెచ్‌డీ, కార్టూన్ నెట్‌వర్క్ వంటి ప్రముఖ బ్రాడ్‌కాస్ట్ ఛానెల్స్‌ను లైవ్‌గా వీక్షించొచ్చు. మైజియో యాప్, జియో.కామ్ వెబ్‌సైట్, థర్డ్‌పార్టీ రీఛార్జి యాప్‌లలో ఈ ప్లాన్ అన్ని టెలికాం సర్కిల్స్‌లో అందుబాటులో ఉందని కంపెనీ తెలిపింది.

# 'ఎస్‌బీఐ' లాభం రూ.24.113 కోట్లు

- **కలిసొచ్చిన ప్రధాన ఆదాయం, తక్కువ కేటాయింపులు**

ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) జూన్ త్రైమాసికంలో రూ.24,113 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2025-26 ఇదే లాభం రూ.21,201.47 కోట్లతో పోలిస్తే ఇది 13.73% అధికం. ప్రధాన వడ్డీ ఆదాయం పెరగడం, కేటాయింపులు తగ్గడం ఇందుకు కలిసివచ్చింది. స్టాండలోన్ ఖాతాల ప్రకారం బ్యాంకు నికర లాభం రూ.19,160.44 కోట్ల నుంచి 10.23% వృద్ధితో రూ.21,121.22 కోట్లకు చేరుకుంది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం దాదాపు 15% పెరిగి రూ.46,992 కోట్లకు చేరుకుంది. ఇందుకు స్థూల రుణాల జారీలో 18.63% వృద్ధి సహకరించింది.

దేశీయ నికర వడ్డీ మార్జిన్ 3 శాతానికి తగ్గినా, త్రైమాసికం వారీగా 0.07% పెరిగింది వడ్డీయేతర ఆదాయం 9% తగ్గి రూ.15,293 కోట్లకు చేరింది. ఫారెక్స్/డెరివేటివ్స్ ఆదాయాలు 70% క్షీణించడం ఇందుకు కారణం. డిపాజిట్లు 9.73% రాణించాయి. కరెంట్, సేవింగ్ ఖాతాలకిచ్చే తక్కువ వడ్డీ రుణాల వాటా 0.12% తగ్గి 39.36 శాతానికి పరిమితమైంది.




తగ్గిన మొండి బకాయిలు: ఈ ఏడాది జూన్ 30 నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.47 శాతానికి మెరుగైంది. 2026 మార్చి 31 నాటి 1.49%తో పోల్చినా, 2025 జూన్ చివరిలోని 1.83 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. 3189 రోజుల పాటు చెల్లింపులు లేని రుణాలు (ఎన్‌పీఏలు కాదు) ఈ ఏడాది మార్చిలో రూ.3350 కోట్లుగా ఉండగా, జూన్ చివరికి రూ.4174 కోట్లకు పెరిగాయి. నిరర్థక ఆస్తులకు కేటాయింపులు రూ.4,934 కోట్ల నుంచి రూ.3,359 కోట్లకు తగ్గాయి. బ్యాంకు కనీస మూలధన నిష్పత్తి 15.67 శాతంగా నమోదైంది.




# వీవీఎస్ లక్ష్మణ్‌తో భేటీ కానున్న బీసీసీఐ కార్యదర్శి.. కారణం ఇదే?

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఆటగాళ్లు గాయాల నుంచి కోలుకునే ప్రక్రియను సమీక్షించేందుకు ఆదివారం బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా బెంగళూరులో వీవీఎస్ లక్ష్మణ్(V VS Laxman)తో సమావేశం కానున్నారు. ఇటీవల టీమ్‌ఇండియా ఆటగాళ్లు వరుసగా గాయాల బారినపడుతున్నారు. వారు మళ్లీ ఫిట్‌నెస్ సాధించి మైదానంలో అడుగుపెట్టడానికి చాలా రోజులు పడుతోంది. గాయాల కారణంగా త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, హర్షిత్ రాణా,




నితీశ్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ దూరమైన సంగతి తెలిసిందే. గాయాల నుంచి కోలుకుంటున్న హార్దిక్ పాండ్య, ఆకాశ్ దీప్, ప్రిన్స్ యాదవ్ కూడా సీఓఈలోనే ఉన్నారు. దీంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్న స్పోర్ట్స్ సైన్స్ బృందం అధిక పనిభారంతో సతమతవుతోంది. కొంత ఆటగాళ్లను పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించకముందే సీఓఈ నుంచి పంపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో సీవోఈ బృందం, సెలక్షన్ కమిటీ మధ్య విభేదాలు తలెత్తాయని వార్తలొచ్చాయి. ఈ అంశాలపై చర్చించడానికి వీవీఎస్ లక్ష్మణ్‌తో బీసీసీఐ కార్యదర్శి భేటీకానున్నారు.

# చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్.. ప్రపంచంలో తొలి స్పిన్నర్‌గా రికార్డు

అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (Rashid Khan) అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో మూడుసార్లు ఆరు వికెట్ల ప్రదర్శన చేసిన తొలి స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. బ్రెడీ క్రికెట్ క్లబ్ వేదికగా ఐర్లాండ్‌తో (IRE vs AFG) శుక్రవారం రాత్రి జరిగిన రెండో వన్డేలో రషీద్ ఖాన్ (6/34) అదరగొట్టి ఈ ఘనత అందుకున్నాడు. అంతకుముందు మార్చి 17, 2017న గ్రేటర్ నోయిడాలో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అఫ్గాన్ స్పిన్నర్ 9.3 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. అలాగే, జూన్ 9, 2017న గ్రోస్ ఐస్లెట్‌లో వెస్టిండీస్‌పై 8.4 ఓవర్లలో 18 పరుగులే ఇచ్చి ఏకంగా ఏడు వికెట్లు తీశాడు. స్పిన్నర్లయిన అజంత మెండిస్ (శ్రీలంక), వానిందు హసరంగ (శ్రీలంక), ఇమ్రాన్ తాహిర్ (సౌతాఫ్రికా), షాహిద్ అఫ్రిది (పాకిస్థాన్), అకిల ధనంజయ (శ్రీలంక), సందీప్ లామిచానే (నేపాల్) వన్డేల్లో రెండేసిసార్లు ఆరు వికెట్ల ప్రదర్శన చేశారు. ఇప్పుడు వీరందరిని అధిగమించిన రషీద్



ఖాన్ కొత్త సృష్టించాడు. ఇక ఓవరాల్‌గా వన్డేల్లో అత్యధికసార్లు ఆరు వికెట్లు తీసిన రికార్డు పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ వకార్ యూనిస్ పేరిట ఉంది. అతడు తన కెరీర్‌లో మొత్తం ఐదుసార్లు ఆరు లేదా అంతకంటే వికెట్లు పడగొట్టాడు. అతడి అత్యుత్తమ ప్రదర్శన (7/36).

# లియోనెల్ మెస్సి ఇంట్లో విషాదం

అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సి ఇంట్లో విషాదం నెలకొంది. మెస్సి తండ్రి జార్జ్ మెస్సి (68) దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అర్జెంటీనాలోని తన స్వస్థలమైన రోసారియోలో శుక్రవారం సాయంత్రం (స్థానిక కాలమానం ప్రకారం) కన్నుమూశారు. లియోనెల్ కెరీర్‌ను తీర్చిదిద్దడంలో జార్జ్ కీలకపాత్ర పోషించారు. చిన్ననాటి నుంచి అంతర్జాతీయ సాకర్ దిగ్గజంగా ఎదిగే వరకు మార్గనిర్దేశం చేశారు. జార్జ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారని మెస్సి కుటుంబం జూన్‌లో ఒక



ప్రకటన విడుదల చేసింది. ఫిఫా ప్రపంచ కప్ సమయంలో జార్జ్ మరణించినట్లు వార్తలు రాగా.. కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే.

# కొరియా మాస్టర్స్ ఫైనల్‌కు చేరిన అస్మిత చాలిహా

భారత యువ షట్లర్ అస్మిత చాలిహా అదరగొట్టేస్తోంది. తన తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకుంది. కొరియా మాస్టర్స్ 300లో మరో భారత షట్లర్ రక్షిత రామరాజ్‌పై అస్మిత విజయం సాధించింది. చివరి గేమ్ వరకూ వెళ్లిన పోరులో అస్మిత 2113, 1621, 2113 తేడాతో రక్షితపై గెలిచింది. దాదాపు మూడు నెలలపాటు ఆటకు దూరమైన 26 ఏళ్ల అస్మిత గత మేలోనే మైదానంలోకి దిగింది. ప్రతి మ్యాచ్‌లోనూ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది.

**ఫైనల్‌కు చేరిన హాన్**

చైనా షట్లర్ కియాన్సి హాన్ ఫైనల్‌కు దూసుకొచ్చింది. మరో సెమీస్‌లో హాన్ 2220, 1821, 2114 తేడాతో కొరియా ప్లేయర్ గ్రేస్ కిమ్‌పై విజయం సాధించింది. దీంతో ఆదివారం జరగనున్న ఫైనల్‌లో భారత షట్లర్ అస్మితతో హాన్ టైటిల్ కోసం తలపడనుంది.





## వైభవ్ సూర్యవంశీ స్పెషాలిటీ ఏంటి? సింపుల్‌గా చెప్పేసిన శిఖర్ ధావన్

చిన్న వయసులోనే పరిణతితో ఆడటం సాధారణ విషయం కాదని.. వైభవ్ సూర్యవంశీ చాలా స్పెషల్ అని మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసించాడు. స్ట్రోక్ ప్లేతోపాటు నిర్భయంగా ఆడే మనస్తత్వం అతడి సొంతమని తెలిపాడు. 15 ఏళ్ల వయసులోనే స్టార్ బౌలర్లపైనా ఆధిపత్యం ప్రదర్శించడం అద్భుతమన్నాడు. "కేవలం దూకుడుగా ఆడటంతోనే వైభవ్ సూర్యవంశీ హైలైట్ కావడం లేదు. అతడిలో మరో ప్రత్యేకత కూడా ఉంది. ఎలాంటి షాట్‌నైనా మనసు పెట్టి ఆడతాడు. నైపుణ్యంతోపాటు ఇలాంటి అలవాటు ఉంటే అతడిని ఆపడం చాలా కష్టం. పిన్న వయసులోనే ఆ సత్తాను అందుకోవడం అభినందనీయం.

# శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్.. రెండో రోజు ముగిసిన ఆట

కొలంబో: శ్రీలంక క్రికెట్ ఎలెవన్, భారత్ మధ్య జరుగుతున్న మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌ను శ్రీలంక ఎలెవన్ 363/8 వద్ద డిక్లేర్ చేయగా.. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా శనివారం ఆట ముగిసే సమయానికి 357/6 స్కోరుతో నిలిచింది. భారత్ ఇంకా ఆరు పరుగుల వెనుకంజలో ఉంది. దేవదత్ పడిక్కల్ (142*; 137 బంతుల్లో 14 ఫోర్లు) శతకంతో ఆకట్టుకున్నాడు. పడిక్కల్‌తోపాటు గుర్నూర్ బ్రార్ (36*; 18 బంతుల్లో) క్రీజులో ఉన్నాడు. నాలుగో స్థానంలో వచ్చిన రవీంద్ర జడేజా (63 రిటైర్డ్ హర్ట్; 117 బంతుల్లో) రాణించగా.. కేఎల్ రాహుల్ (40; 67 బంతుల్లో), మానవ్ సుతార్ (41; 90 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు. సరాంశ్ జైన్ (22) రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. యశస్వి



జైస్వాల్ ఎదుర్కొన్న రెండో బంతికే డకౌట్‌గా వెనుదిరగ్గా.. రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఆట చివర్లో గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్‌లో నాలుగు సిక్స్‌లు బాదేశాడు. శ్రీలంక బౌలర్లలో రమేశ్ మెండిస్ 2, అసంక మనోజ్ 2, కేసర నువాంత, విశ్వ ఫెర్నాండో ఒక్కో వికెట్ పడగొట్టారు.



వారణాసి మూవీలో.. మందాకిని పాత్రలో.. అలరించనున్న ప్రియాంక చోప్రా

## ఒకే పాట కోసం..కోటిన్నర

నాని హీరోగా నటిస్తున్న ప్యారడైజ్ సినిమా కోసం కీర్తి సురేశ్.. భారీ ప్యాకేజీ అందుకోనున్నట్లు టాలీవుడ్ వర్గాల భోగట్టా. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఓ స్పెషల్ ఐటెం సాంగ్ ప్లాన్ చేశారు. ఇందుకోసం కీర్తి సురేశ్ తో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే.. కోటిన్నర రెమ్యూనరేషన్ ఆఫర్ చేసినట్లు అనధికారిక సమాచారం. కాగా, ప్యారడైజ్ మూవీ సెప్టెంబర్ 24న విడుదల కానుంది. పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమాకు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ మూవీలో కీర్తి సురేష్ ఓ స్పెషల్ సాంగ్‌లో కనిపించనుంది. ఇటీవలే హైదరాబాద్‌లో నాని, కీర్తి సురేష్‌లపై ఈ స్పెషల్ సాంగ్‌ను షూట్ చేశారు.





## తెలుగు వెబ్‌సిరీస్‌లో మీనాక్షి

హీరోయిన్ మీనాక్షి చౌదరి తెలుగులో ఓ ప్రయోగం చేయబోతుంది. ఫస్ట్ టైమ్ ఓ వెబ్ సిరీస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మనీ హైస్ట్ తరహాలో బ్యాంకింగ్ స్కామ్‌ల బ్యాక్‌డ్రాప్‌లో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సిరీస్‌లో డీజే టిల్లు హీరో సిద్ధు జొన్నలగడ్డ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. అతడికి జోడీగా మీనాక్షి చౌదరి కనిపించబోతున్నది. ఇద్దరి పాత్రలు నెగెటివ్ టచ్‌లో సాగుతాయని సమాచారం. తెలుగులో ఓటీటీ హిస్టరీలోనే హయ్యెస్ట్ బడ్జెట్ రూ.20 కోట్లతో తెరకెక్కుతోన్నట్లు సమాచారం. ఈ సిరీస్‌కు లక్కీ భాస్కర్ ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తుండగా సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సిరీస్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. వచ్చే ఏడాది స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిసింది.



## నల్లపిల్లిని చూసి.. వణికిపోయింది

బాలీవుడ్‌లో రాగిణి 3 పేరుతో ఓ హారర్ మూవీ చేస్తోంది మిల్కీ బ్యూటీ తమన్నా. సెట్స్‌లో తనకు ఎదురైన అనూహ్య సంఘటన గురించి సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది. రాగిణి ఎంఎంఎస్ షూటింగ్ ముంబైలోని పాత కాలం నాటి బంగళాలో నైట్ షూట్స్ చేస్తున్నారు. ఈ సమయంలో తమన్నా ముందు ఓ నల్లపిల్లి హఠాత్తుగా జంప్ చేసింది. నిజంగానే దయ్యం వచ్చిందనుకొని భయంతో తమన్నా గట్టిగా అరిచింది. ఈ అరుపులతో యూనిట్ సభ్యులు మొత్తం కంగారు పడ్డారట. చివరకు అసలు విషయం తెలిసి అంతా నవ్వుకున్నారట. ఈ మొత్తం ఉదంతాన్ని వివరిస్తూ తమన్నా ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టడంతో అది కాస్త వైరల్ అవుతోంది. ఎక్తా కపూర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు శశాంక ఘోష్ దర్శకత్వం వహిస్తున్నాడు.



## కాశీ క్షేత్రం వైపు గ్రహశకలం దూసుకొస్తే

మహేష్‌బాబు వారణాసి మూవీ కథ లీకైందంటూ సోషల్ మీడియాలో ఓ వార్త తెగ హల్‌చల్ చేస్తుంది. 2027లో వారణాసి కథ మొదలై రామాయణ కాలానికి వెళుతుందంటూ ఓ స్టోరీని అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. శాంభవి అనే గ్రహశకలం వారణాసిని ఢీ కొట్టేందుకు వస్తూ భూమిపై పడితే ప్రపంచ వినాశనం తప్పదని భయపడుతుంటారు. ఆర్కియాలజిస్ట్ రుద్ర (మహేశ్ బాబు) దీన్ని ఎదుర్కోవడంలో మందాకిని (ప్రియాంక చోప్రా) సాయంగా నిలబడుతుంది. అంటార్కిటికా, ఆఫ్రికా అడవులతో పాటు ఎన్నో ప్లేస్‌లలో వారి అన్వేషణ చేస్తారు. చివరకు రామాయణంలో పరిష్కారం ఉందని..కనిపెడతారు. టైమ్ మిషన్ ద్వారా రుద్ర, మందాకిని రామాయణ కాలానికి వెళ్తారు. అయితే వారిని రహస్యంగా కుంభా అనే విలన్ అనుసరిస్తారు. వారణాసిలో నుంచి మొదలైన ప్రయాణం తిరిగి వారణాసికే చేరుకుంటుంది. శాంభవి బారి నుంచి భూమిని ఎలా కాపాడారనే అంశాలతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాజమౌళి దర్శకత్వం వహిస్తుండగా కీరవాణి సంగీతం అందిస్తున్నారు. కాగా ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న థియేటర్లలోకి రాబోతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.